


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 172, పేజీలు - 08




బుధవారం, డిసెంబర్ 3, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

## కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులకు
# 6 నెలలే పదవి కాలం

### - పని చేయకపోతే ఊస్టింగ్ ఖాయమన్న సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో జిల్లా అధ్యక్షులుగా నియమితులైన కాంగ్రెస్ నేతలు పదవి వచ్చిందని పెత్తనం చేయకుండా పని చేయాలని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. కొత్త డీసీసీ అధ్యక్షుల పనితీరును ఆరు నెలల ప కాలంలో పరిశీలించి, సంతృప్తికరంగా లేకపోతే తీసేస్తామన్నారు. కొత్త నాయకత్వాన్ని నియమిస్తామన్నారు. ఈ నిర్ణయాన్ని ఎఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ కూడా సమర్థించారు. గుజరాత్ లో అయితే డీసీసీ అధ్యక్షులకు మూడు నెలలు మాత్రమే గడువు ఇస్తున్నామన్నారు. డీసీసీల పునర్వ్యవస్థీకరణ ద్వారా పార్టీని కింది స్థాయి నుంచి బలోపేతం చేయడానికి ఉద్దేశించినట్లుగా కనిపిస్తోంది. ఆక్టోబర్ 24న ఢిల్లీలో ఎయిఐసీసీ జనరల్ సెక్రటరీ కె.సి. వేణుగోపాల్‌తో జరిగిన సమావేశంలో ఈ ప్లాన్‌ను ఫైనలైజ్ చేశారు. కొత్త డీసీసీ అధ్యక్షులు పార్టీ కార్యక్రమాలను జోరుగా చేపట్టాలి. అన్నింటినీ ఎప్పటికప్పుడు ఎసెస్ చేస్తారు. ప్రతి జిల్లాలో ఏఐసీసీ ఆబ్జర్వర్లు ఉంటారు టీపీసీసీ టీమ్ మీనాక్షి నటరాజన్ మూల్యాంకనం చేస్తారు. పనితీరు సంతృప్తికరంగా లేకపోతే, ఆరు నెలల తర్వాత డీసీసీ పదవులనుంచి తప్పించి కొత్త నాయకులను నియమిస్తారు. పార్టీలో 'పెర్ఫార్మెన్స్ బేస్డ్' వ్యవస్థను ప్రవేశపెట్టే వ్యూహంలోనే దీన్ని అమలు చేస్తున్నట్లుగా కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

2లో..

## సోనియా, రాహుల్ గాంధీలపై
# అక్రమ కేసులను ఖండిస్తున్నాం

### - ఎన్డీయే సర్కార్‌పై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై కొత్త కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. "ఓటు చోరీ" ప్రచారం నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి కొత్త కేసు నమోదు చేశారని ఆరోపించారు. టీ కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం గాంధీ భవన్ లో జరిగిన ఎగ్జిక్యూటివ్ సమావేశంలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై కేంద్రం అక్రమ కేసులను పెట్టడాన్ని ఖండిస్తూ తీర్మానం చేశామని తెలిపారు. వారిని కాపాడుకోవడానిక కాంగ్రెస్ సైనికులుగా ఎంత వరకు వెళ్లడానికైనా సిద్ధమని ప్రకటించారు. రాహుల్ గాంధీ చేపట్టిన "ఓట్ చోరీ ఉద్యమం" నుండి దృష్టి మరల్చడానికి నేషనల్ హెరాల్డ్ విషయంలో అక్రమ ఎఫ్ఐఆర్ లు బనాయిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలోని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సోనియా, రాహుల్ గాంధీలపై "అక్రమ కేసు" నమోదును ఖండిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి

2లో..

## పీఎంవో కాదు ఇక సేవా తీర్థ్

- ప్రధాని కార్యాలయ నూతన కాంప్లెక్స్‌కు 'సేవా తీర్థ్'గా నామకరణం
- దేశవ్యాప్తంగా రాజ్‌భవన్ల పేర్లను 'లోక్ భవన్'గా మారుస్తున్న కేంద్రం
- వలసవాద గుర్తులను తొలగించే ప్రక్రియలో భాగంగా ఈ మార్పులు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మరో చారిత్రక నిర్ణయానికి తెరలేపింది. దేశ రాజధాని ఢిల్లీలో నిర్మిస్తున్న సెంట్రల్ విస్తా ప్రాజెక్టులో భాగంగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని మార్చనున్నారు. అదే సమయంలో ప్రధాని కార్యాలయం పేరును మార్చుతూ కీలక నిర్ణయం తీసుకుంది. పీఎంఓను ఇకనుంచి సేవాతీర్థ్‌గా పిలవనున్నట్లు తెలిపింది. 78 ఏళ్లుగా సౌత్ బ్లాక్‌లోని కార్యాలయం నుంచి ప్రధానమంత్రులు విధులు నిర్వర్తిస్తుండగా ఆ కార్యాలయం ఇప్పుడు

2లో..

## అమరావతిలో రెండో విడత
# ల్యాండ్ పూలింగ్

- 16,666 ఎకరాలు నోటిఫై చేస్తూ ఉత్తర్వులు - అమరావతి, తుళ్లూరు మండలాల పరిధిలో భూముల సేకరణ
- ప్రక్రియ వేగవంతం చేయాలని సీఆర్‌డీఏకు ప్రభుత్వ ఆదేశం

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతంలో రెండో విడత ల్యాండ్ పూలింగ్‌కు సంబంధించి ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాజధాని ప్రాంతంలోని ఏడు గ్రామాలలో ల్యాండ్ పూలింగ్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. మొత్తం 16,666 ఎకరాలకు ల్యాండ్ పూలింగ్ కోసం నోటిఫికేషన్ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో అమరావతి మండలంలోని ఐదు గ్రామాలు ఉన్నాయి. అమరావతి మండలంలోని వైకుంఠపురం, పెద్ద మద్దూరు, ఎండ్రాయి, కర్లపూడి, లెమల్లె గ్రామాల్లో 7,465 ఎకరాలకు ల్యాండ్ పూలింగ్ చేయనున్నారు.



2లో..

## తెలంగాణ రాజ్‌భవన్ ఇకపై
# 'లోక్ భవన్ - తెలంగాణ'

### - తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రాలలో గవర్నర్ల, కేంద్రపాలిత ప్రాంతాల్లో లెఫ్టినెంట్ గవర్నర్ల అధికార నివాసం "రాజ్ భవన్" పేరు మారుతున్న సంగతి తెలిసిందే. ఇకపై గవర్నర్ల, లెఫ్టినెంట్ గవర్నర్ల అధికారిక నివాసాలను రాజ్‌భవన్‌కు బదులుగా లోక్‌భవన్‌గా, రాజ్ నివాస్‌కు బదులుగా రాజ్ నివాస్‌గా మార్చుతున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణ రాజ్‌భవన్ పేరును కూడా లోక్‌భవన్‌గా మార్చారు. ఈ మేరకు గవర్నర్ కార్యాలయం నుంచి అధికారిక ప్రకటన వెలువడింది.

2లో..

# హిల్ట్ భూములపై బీఆర్ఎస్ పోరాటం

### - 2 రోజులపాటు క్షేత్రస్థాయి పరిశీలనకు నేతలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటానికి భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) సిద్ధమైంది. హైదరాబాద్ మహానగర పరిధిలో రూ. 5 లక్షల కోట్ల విలువైన పారిశ్రామిక భూములను 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ' (హిల్ట్) పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దాన్ని అడ్డుకోవాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఇందులో భాగంగా పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా సీనియర్ నాయకులతో కూడిన 'నిజనిర్ధారణ బృందాలను' నియమించారు. దీనిలో భాగంగా పార్టీ ముఖ్య నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్రస్థాయి పర్యటనలపై దిశానిర్దేశం చేశారు.

**భూములను రియల్ ఎస్టేట్ పరం చేస్తున్న కాంగ్రెస్..**

బీఆర్ఎస్ ముఖ్య నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత ప్రభుత్వాలు పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పన కోసం అతి తక్కువ

2లో..



## హైదరాబాద్‌లో
# భారీ స్కాం

### - రూ.792 కోట్ల ఫాల్కన్ గ్రూప్ స్కామ్‌లో ఈడీ కీలక చర్యలు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భారీ మొత్తంలో ఇన్వెస్టర్లను మోసం చేసిన ఫాల్కన్ గ్రూప్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కీలక చర్యలు చేపట్టింది. సుమారు రూ.792 కోట్ల ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్

2లో..

## వినియోగదారే
# విద్యుత్ ఉత్పత్తిదారు

### - విద్యుత్ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు మరో ఏడాది పాటు ప్రోత్సాహకాలను పొడిగిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో కీలకమైన పరిశ్రమలుగా వీటిని గుర్తించి మరో ఏడాదిపాటు ప్రోత్సాహకాలను పొడిగిస్తున్నట్టు సీఎం ప్రకటించారు. తద్వారా ప్రభుత్వంపై రూ. 1,053 కోట్ల భారం పడనుంది. మంగళవారం సచివాలయంలో విద్యుత్ శాఖపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితి, పీఎం కుసుమ్, ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద సోలార్ రూఫ్ టాప్ పథకం, విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ వ్యయం తగ్గింపు తదితర అంశాలపై ఉన్నతాధికారులతో చర్చించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా జరగాలని



2లో..

## రాజకీయ కక్షలు వదిలి మంచి సర్పంచ్‌లను ఎన్నుకోవాలి

### - సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు



ఖమ్మం (ప్రశ్న న్యూస్) ఖమ్మం జిల్లా కాంగ్రెస్‌కు కంచుకోట అని, గత ఎన్నికల్లో ఈ జిల్లా సంపూర్ణంగా ఆశీర్వదించి కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలబడిందని కొత్తగూడెం సభలో సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. మంగళవారం డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ యూనివర్సిటీకి శంకుస్థాపన

2లో..

## మేమిద్దరం
# అన్నదమ్ముల్లాంటి వాళ్లం

### - డీకేశి ఇంట్లో సీఎం సిద్ధరామయ్య అల్పాహార విందు భేటీ



**బెంగుళూరు (ప్రశ్న న్యూస్)** కర్ణాటక రాజకీయాల్లో ఆసక్తి రేపిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అల్పాహార విందు భేటీ ఇవాళ ఉదయం ముగిసింది. బెంగళూరులోని

2లో..

# జీహెచ్ఎంసీ విస్తరణకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్

### - దేశంలోనే అతి పెద్ద నగరంగా విస్తరించనున్న హైదరాబాద్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధి విస్తరణకు మార్గం సుగమమైంది. జీహెచ్ఎంసీలో 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను విలీనం చేస్తూ ప్రభుత్వం జారీ చేయనున్న ఆర్డినెన్స్‌కు తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సోమవారం ఆమోదం తెలిపారు. జీహెచ్ఎంసీ, పురపాలక చట్టాల సవరణకు సంబంధించిన ఆర్డినెన్సులపై ఆయన ఆమోద ముద్ర వేశారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై, హైదరాబాద్ నగరాన్ని మరింత విస్తరించాలని కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపల, దానిని ఆనుకుని ఉన్న 27 నగర, పురపాలక సంఘాలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని క్యాబినెట్ తీర్మానించింది.



2లో..

# వినియోగదారే విద్యుత్ ఉత్పత్తిదారు

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేకించి విద్యుత్ సరఫరా, పంపిణీ నష్టాలను 2029 నాటికి 9.20 శాతం నుంచి గణనీయంగా తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. విద్యుత్ కొనుగోళ్ల భారం తగ్గించుకునేందుకు ఇతర రాష్ట్రాలతో పవర్ స్వాపింగ్ ఒప్పందాలు కుదుర్చుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. పీఎం కుసుమ్ సహా ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద సోలార్ రూఫ్ టాప్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పీఎం కుసుమ్ ప్రాజెక్టు కింద 4,792 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని సీఎం సూచించారు. ప్రభుత్వ భవనాలపై సౌర ఫలకలను ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు 483కు పైగా ప్రభుత్వ భవనాలపై సౌర ఫలకలను ఏర్పాటు చేసి 150 మెగావాట్ల మేర విద్యుత్ ఉత్పత్తి చేసేలా కార్యాచరణ చేపట్టనున్నారు. ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజలు కూడా విద్యుత్ పొదుపు చేసేలా ఉపకరణాలు వినియోగించేందుకు అవగాహనా కార్యక్రమాల్ని చేపట్టాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు.

### ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలు 60 రోజుల్లో కార్యాచరణ

రాష్ట్రంలో విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన సంస్థలు ఐస్(ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ) పాలసీ ద్వారా 60 రోజుల్లోనే తమ కార్యాచరణను ప్రారంభించేలా చూడాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనలు జారీ చేశారు. ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించి అనుమతులు జారీ చేయాలని సీఎం స్పష్టం చేశారు. తద్వారా విద్యుత్ ఉత్పత్తిలో ఏపీ ఓ న్యూ ఎనర్జీ హబ్‌గా మారాలని వ్యాఖ్యానించారు. ఈ రంగంలో వినూత్న ఆవిష్కరణలు రావాల్సి ఉందని అన్నారు. అలాగే విద్యుత్ సంస్థలు రుణ సమీకరణలో వడ్డీ భారాన్ని తగ్గించుకోవాలని సూచించారు. విద్యుత్ కొనుగోళ్లలోనూ వ్యయం తగ్గించుకోవాలని ముఖ్యమంత్రి సూచనలు చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో యూనిట్‌కు 20 పైసల చొప్పున కొనుగోలు వ్యయం తగ్గించినట్టు సీఎస్ కె.విజయానంద్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈపీఎంఎస్ విధానంతో నిరంతరం పర్యవేక్షణ ద్వారా రూ.400 నుంచి 500 కోట్ల మేర పొదుపు చేయగలిగామని తెలిపారు.దీనిపై స్పందించిన సీఎం ఇతర రాష్ట్రాలతో పవర్ స్వాపింగ్ ఒప్పందాల ద్వారా కొనుగోలు వ్యయం తగ్గుతుందని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పరిశ్రమలకు, వాణిజ్యం, గృహ అవసరాలు, వ్యవసాయ రంగానికి జరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని ఎప్పటికప్పుడు విశ్లేషించాలని.. డిమాండ్‌కు తగినట్టుగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పీఎం కుసుమ్ కింద దేవాదాయ, జలవనరుల శాఖలకు చెందిన భూముల్లో విద్యుత్ ఉత్పత్తి చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. వినియోగదారులే విద్యుత్ ఉత్పత్తి చేయటం ద్వారా తాము వినియోగించుకున్న అనంతరం మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించడం ద్వారా ఆదాయం ఆర్జించేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగానే సోలార్ రూఫ్ టాప్ పథకం కింద సౌర ప్యానెల్లు ఏర్పాటు చేస్తున్నామని సీఎం తెలిపారు. బీసీ వినియోగదారుకు 3 కిలోవాట్ల వరకూ రూ.20 వేల సబ్సిడీ అమలు చేసేందుకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. చేనేతలకు ప్రభుత్వం ప్రకటించిన 200 యూనిట్లు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కూడా అమలు చేయాలని ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా మూలధన రాయితీ, జీఎస్టీ మినహాయింపు సహా 9 అంశాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంగీకారం తెలిపారు.

### వెయ్యి ఈవీ బస్సుల కొనుగోలు

రాష్ట్రంలోని రిజర్వాయర్ల వద్ద పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల ఏర్పాటు చేసేందుకు ఉన్న అవకాశాలను జెన్‌కో ఇరిగేషన్ అధికారులతో కలిసి అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. సాగునీటి ప్రాజెక్టుల వద్ద పీఎస్పీ ప్రాజెక్టులు ఏర్పాటు చేసుకుంటే పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి సాధ్యం అవుతుందని అన్నారు. ఐదేళ్లలో ఆర్టీసీ బస్సులను ఈవీలుగా మార్చాలని సీఎం సూచించారు. త్వరలోనే వెయ్యి ఈవీ బస్సుల్ని కొనుగోలు చేయాలన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ పంపిణీ సంస్థలు నాన్ టారిఫ్ ఆదాయం పై దృష్టి పెట్టాలని సీఎం సూచనలు చేశారు. థర్మల్ పవర్ స్టేషన్లలోని బూడిదను వివిధ అవసరాలకు సద్వినియోగం చేసుకునే అంశాన్ని పరిశీలించాలని, కాలుష్యానికి అడ్డుకట్ట వేసేందుకు ఐఐటీ బృందంతో అధ్యయనం చేయించాలన్నారు.

### గత పాలకుల నిర్ణయాలతో విద్యుత్ వ్యవస్థ విధ్వంసం

గత పాలకులు విద్యుత్ వ్యవస్థను అస్తవ్యస్తంగా మార్చేశారని ముఖ్యమంత్రి సమీక్షలో ప్రస్తావించారు. పీపీఏల రద్దు నిర్ణయంతో రూ.9 వేల కోట్ల మేర భారం ప్రజలపై పడిందని పేర్కొన్నారు. విద్యుత్‌ను వినియోగించుకోకుండానే ఆయా విద్యుత్ కంపెనీలకు రూ.9 వేల కోట్ల ప్రజాధనాన్ని చెల్లించాల్సి వచ్చిందని అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఈ వ్యవస్థలను గాడిలో పెట్టామని తెలిపారు. విద్యుత్ వ్యవస్థల సమర్థ నిర్వహణ ద్వారా విద్యుత్ ఛార్జీలను పెంచకుండానే ఆ భారాన్ని జీరో చేయగలిగామని సీఎం వివరించారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయటంతో పాటు దానికి రేటింగ్ ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. విద్యుత్ ఉత్పత్తిలో లోటు లేకుండా దీర్ఘకాలిక ప్రణాళికలు చేయాలని సూచించారు. విద్యుత్ రంగంలో నూతన ఆవిష్కరణల కోసం ప్రతీ ఏటా హ్యాకథాన్ నిర్వహించాలన్నారు. ఈ సమీక్షకు మంత్రి గొట్టిపాటి రవికుమార్, సీఎస్ కె.విజయానంద్, ట్రాన్స్ కో, జెన్కో, డిస్కమ్ సీఎండీలు హాజరయ్యారు.

# హిల్ట్ భూములపై బీఆర్ఎస్ పోరాటం

ధరకే కేటాయించిన భూములను, ఇప్పుడు 'మల్టీ యూజ్ జోన్' పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మారుస్తున్నారని ఆరోపించారు. సుమారు 9,300 ఎకరాల విలువైన భూములను మార్కెట్ విలువ కంటే అతి తక్కువకు, కేవలం ఎస్.ఆర్.ఓ రేటులో 30 శాతానికే రెగ్యులరైజ్ చేసి, సుమారు రూ. 5 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టే కుట్ర జరుగుతోందని కేటీఆర్ ఆరోపించారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టడానికి, కనీసం స్మశాన వాటికలకు కూడా స్థలాలు లేవని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం, వేల కోట్ల విలువైన భూములను మాత్రం ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తోందని ఆయన మండిపడ్డారు. ఈ కుంభకోణం నిజా నిజాన్ని ప్రజల ముందు ఉంచాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.ప్రభుత్వ విధానాన్ని ఎండగట్టేందుకు, హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న పారిశ్రామిక వాడలను 8 క్లస్టర్లుగా విభజించి, పార్టీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో బృందాలు డిసెంబర్ 3, 4 తేదీల్లో క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తాయి. ఈ పర్యటనలలో బీఆర్ఎస్ నాయకులు స్థానిక నాయకులను, ప్రజలను కలుపుకుని, వాస్తవ మార్కెట్ విలువకు, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఉన్న భారీ వ్యత్యాసాన్ని ప్రజల ముందు ఉంచాలని ప్లాన్ చేశారు. ఈ పర్యటనల్లో, పారిశ్రామిక వాడల ద్వారా ప్రజా ఉపయోగ కార్యక్రమాలు ఏమేం చేయవచ్చు, అక్కడి స్థానిక ప్రజల సుదీర్ఘకాల డిమాండ్లు, ఆకాంక్షలను కూడా పార్టీ నేతలు తెలుసుకోనున్నారు. ఒకప్పుడు పారిశ్రామిక వాడల ఏర్పాటు కోసం ప్రజలు భూములు ఇచ్చిన తీరును, ప్రభుత్వాలు అత్యంత చవకగా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టిన అంశాన్ని, వాటి అసలు ఉద్దేశాలను ఈ బృందాలు ప్రజలకు వివరించనున్నాయి.

### హెచ్.ఐ.ఎల్.టి.పి స్కామ్ నిజనిర్ధారణ బృందాల పర్యటన వివరాలు

డిసెంబర్ 3, 4 తేదీలలో హైల్ట్ స్కామ్‌పై నిజనిర్ధారణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన ఎనిమిది బృందాలు వివిధ ప్రాంతాల్లో పర్యటించనున్నాయి. క్లస్టర్-1లో మాజీ మంత్రి హరీష్ రావు నేతృత్వంలో గంగుల కమలాకర్, దేశపతి శ్రీనివాస్ మరియు మెదక్ ఎమ్మెల్యేల బృందం పాశమైలారం, పటాన్ చెరువు, రామచంద్రాపురం ప్రాంతాలను సందర్శించి స్కామ్ ఎలా జరుగుతుందో వివరించనున్నారు. క్లస్టర్-2లో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, సురభి వాణీ దేవి, ఉప్పల్ నాయకులు కలిసి నాచారం, మల్లాపూర్, ఉప్పల్, చెర్లపల్లి ప్రాంతాల్లో పర్యటిస్తారు. క్లస్టర్-3కు సంబంధించి మధుసూదనాచారి, మర్రి రాజశేఖర్ రెడ్డి, రవీందర్ రావు మౌలాలి, కుషాయిగూడ పారిశ్రామిక వాడలను సందర్శించి భూముల ధర, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న చర్యలను ప్రజలకు వివరిస్తారు.ముఖ్యంగా క్లస్టర్-4లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సత్యవతి రాథోడ్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానందతో కలిసి జీడిమెట్ల, కూకట్‌పల్లి ప్రాంతాల్లో పర్యటించనున్నారు.

మరోవైపు క్లస్టర్-5లో తలసాని శ్రీనివాస్ యాదవ్, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, నవీన్ రావు సనత్ నగర్, బాలానగర్ ఏరియాలను పరిశీలిస్తారు. క్లస్టర్-6లో చామకూర మల్లారెడ్డి, శంభీపూర్ రాజు మేడ్చల్ ఇండస్ట్రియల్ పార్కుకు వెళ్తారు. క్లస్టర్-7లో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, స్వామి గౌడ్, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, కార్తీక్ రెడ్డి కాటేదాన్, హయత్ నగర్ లో పర్యటిస్తారు. చివరగా క్లస్టర్-8లో మాజీ మంత్రి మహమూద్ అలీ, దాసోజు శ్రవణ్, ఎండీ సలీం చందులాల్ బారాదరి పారిశ్రామిక వాడను సందర్శించి వాస్తవాలను ప్రజలకు వివరిస్తామని బీఆర్ఎస్ నేతలు తెలిపారు.

## రాజకీయ కక్షలు వదిలి మంచి
# సర్పంచ్‌లను ఎన్నుకోవాలి

చేయడం ఒక గొప్ప అవకాశంగా సీఎం పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షను నెరవేర్చి, ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పేరును యూనివర్సిటీకి పెట్టడం తెలంగాణ ప్రజల చిరకాల వాంఛ నెరవేర్చినందుకు ఇచ్చిన గౌరవం అన్నారు. పదేళ్లు ప్రధానమంత్రిగా మన్మోహన్ సింగ్ సంక్షోభంలో ఉన్న దేశాన్ని ఆకాశమంత ఎత్తుకు తీసుకుపోయారని గుర్తు చేశారు.

### తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి కేంద్రం

కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ కోసం వందలాది ఎకరాలను రైతులు ఇచ్చినా, ఉద్యోగాలు మాత్రం ఇతర ప్రాంతాల వారికి ఇవ్వడంతోనే తెలంగాణ ఉద్యమం పాల్వంచలోనే ప్రారంభమైందని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ విధంగా తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన ప్రాంతం కొత్తగూడెం అని ఆయన అన్నారు. విద్య మాత్రమే తెలంగాణను ఉన్నతస్థానంలో నిలబెడుతుందని, అందుకే తమ ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. దేశంలో ఆకలి కేకలను చూసి ప్రపంచంతో పోటీ పడాలనే లక్ష్యంతో తొలి ప్రధాని నెహ్రూ గొప్ప గొప్ప యూనివర్సిటీలను ప్రారంభించారు. అలాగే, నెహ్రూ దేశంలో ఆహార ఉత్పత్తులను పెంచడానికి బాక్రానంగల్ నుంచి శ్రీశైలం, నాగార్జున సాగర్ వరకు అనేక ప్రాజెక్టులను కట్టించారని సీఎం గుర్తు చేశారు. సింగరేణి లాంటి సంస్థలను అభివృద్ధి చేయాలంటే ఎర్త్ యూనివర్సిటీ లాంటి విద్యా సంస్థలు అవసరం అని స్పష్టం చేశారు.

### సాగునీటిపై నిర్లక్ష్యం, అభివృద్ధిపై హామీ

ఖమ్మం జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు గత పదేళ్లు నిర్లక్ష్యానికి గురయ్యాయని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. గత పాలకులకు కమిషన్లు కురిపించాయి తప్ప, పొలాలకు నీళ్లు మాత్రం పారలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం కృష్ణ, గోదావరి జలాలతో ఖమ్మం జిల్లా పొలాలను పారించి సిరులు కురిపించాలని ప్రయత్నం చేస్తోందని అన్నారు. తెలంగాణకు తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ, ఖమ్మం జిల్లా మంత్రులుగా ఉన్న భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు అనుకుంటే ఏమైనా జరుగుతుందని వారికి ఉన్న ప్రాధాన్యతను వెల్లడించారు. భద్రాద్రి రాముల వారి సాక్షిగా ఖమ్మం జిల్లా అభివృద్ధి బాధ్యత తనదేనని, జిల్లా అభివృద్ధికి నిధులు, అనుమతులు మంజూరు చేసే బాధ్యత కూడా నాదేనని గట్టి హామీ ఇచ్చారు.

### మంచి పాలన, స్థానిక నాయకత్వం

తమ ప్రభుత్వం ప్రజా పాలనను అందిస్తూ మంచి పాలన అందిస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రేషన్ కార్డుల పంపిణీ, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ చీరలు వంటి సంక్షేమ కార్యక్రమాలలో ఏ కార్యక్రమం ప్రారంభించినా ఖమ్మం జిల్లా నుంచే ప్రారంభించామని తెలిపారు. మంచి పాలన ఉంటేనే ఉచిత కరెంటు, ఇందిరమ్మ ఇళ్లు వంటి ప్రయోజనాలు ప్రజలకు అందుతాయని అన్నారు. అందుకే గ్రామాల్లో సర్పంచ్‌లు మంచోళ్లు ఉండాలి, మంత్రులతో కలిసి పనిచేసే వాళ్లు కావాలని ప్రజలకు సూచించారు. అభివృద్ధి కోసం మంచి సర్పంచ్‌లను ఎన్నుకోవాలని కోరుతూ, గ్రామాల్లో రాజకీయ కక్షలు మానండి అని ప్రజలకు పిలుపునిచ్చారు. పదేళ్లపాటు అండగా నిలబడి తెలంగాణను దేశంలో అగ్రగామిగా నిలబెడదామని ముఖ్యమంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.

## మాజీ ఎమ్మెల్సీ శుభాష్ రెడ్డి కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సహాయం

గజ్వేల్, : మెదక్ జిల్లా హవెలిఘనపూర్ మండలం కుచన్ పల్లి గ్రామానికి చెందిన రాడ్యా దేవయ్య మరణ వార్త తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ శ్రీ శేరి శుభాష్ రెడ్డి, మృతుని కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఏ అవసరం వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అంత్యక్రియల నిమిత్తం ఆయన రూ.10,000 ఆర్థిక సహాయం అందించారు.

## జీహెచ్ఎంసీ విస్తరణకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్

ఈ నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను రూపొందించి గవర్నర్ ఆమోదం కోసం పంపింది. తాజాగా గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో విలీన ప్రక్రియ అధికారికంగా ముందుకు సాగనుంది. ఈ విలీనం పూర్తయితే హైదరాబాద్ దేశంలోనే అతిపెద్ద నగరంగా అవతరించనుంది. మొత్తం ఐదు జిల్లాలు, 47 మండలాలు, 311 గ్రామాల పరిధిలో విస్తరించి ఉన్న ఈ మహా నగరంలో ఆరు పార్లమెంటు, 28 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండనున్నాయి. గవర్నర్ ఆమోదంతో తదుపరి చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వానికి మార్గం సులభమైంది.

# మేమిద్దరం అన్నదమ్ముల్లాంటి వాళ్లం

సదాశివనగర్‌లో ఉన్న శివకుమార్ నివాసంలో సుమారు గంటన్నర పాటు జరిగిన ఈ సమావేశం అనంతరం ఇరువురు నేతలు తాము ఐక్యంగా ఉన్నామని, కలిసికట్టుగా పనిచేస్తామని వెల్లడించారు. ముఖ్యమంత్రి మార్పు అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానం, రాహుల్ గాంధీ తీసుకునే ఏ నిర్ణయానికైనా కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన సీఎం సిద్ధరామయ్య "తాను, శివకుమార్ అన్నదమ్ముల్లాంటి వాళ్లం. పార్టీ కోసం ఎప్పుడూ కలిసే పనిచేస్తాం. శివకుమార్ ఎప్పుడు సీఎం అవుతారని కొందరు అడుగుతున్నారు. అధిష్ఠానం ఎప్పుడు నిర్ణయిస్తే అప్పుడే అవుతారు" అని బదులిచ్చారు. ఈ నెల 8 నుంచి జరిగే శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించినట్లు తెలిపారు. బీజేపీ అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సిద్ధమవుతోందని, ఆ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటామని వివరించారు.

### సిద్ధరామయ్య కోసం ప్రత్యేకంగా నాటు కోడి వంటకాలు

ఈ అల్పాహార విందు భేటీలో ఆహారం కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సిద్ధరామయ్య కోసం ప్రత్యేకంగా ఇడ్లీ, ఆయన ఇష్టపడే 'నాటు కోడి పులుసు' సిద్ధం చేశారు. తాను మాంసాహారినని, శివకుమార్ శాకాహారి అని సిద్ధరామయ్య సరదాగా వ్యాఖ్యానించారు. "అసలైన నాటు కోడి ఇక్కడ దొరకదని, ఊరి నుంచి మంచి కోడిని తెప్పించమని శివకుమార్‌ను అడిగాను" అని ఆయన చెప్పడం నవ్వులు పూయించింది. శాకాహారి అయిన శివకుమార్ ఇడ్లీ, సాంబార్‌తో సరిపెట్టుకున్నారు. ఈ సమావేశంలో శివకుమార్ సోదరుడు, మాజీ ఎంపీ డీకే సురేశ్, ఎమ్మెల్యే హెచ్.డి. రంగనాథ్ కూడా పాల్గొన్నారు. సిద్ధరామయ్యకు డీకే సోదరులు ఘనస్వాగతం పలికారు. సురేశ్, రంగనాథ్ ముఖ్యమంత్రి పాదాలకు నమస్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ భేటీ ద్వారా తాము ఐక్యంగా ఉన్నామనే బలమైన సందేశాన్ని పార్టీ శ్రేణులకు పంపినట్లయింది.

## తూప్రాన్‌లో నామినేషన్
# హెరాహెూరీ, భారీ బైక్ ర్యాలీ

నర్సాపూర్, : తూప్రాన్ మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల దాఖలు మంగళవారం ఉత్సాహంగా జరిగింది. నామినేషన్లకు చివరి రోజు కావడంతో అభ్యర్థులు పెద్ద సంఖ్యలో ఎంపీడీవో కార్యాలయానికి తరలివచ్చారు. ఇప్పటికే నామినేషన్లు దాఖలు చేసినవారు అదనపు పత్రాలు సమర్పించగా, కొత్తగా వచ్చినవారు నామినేషన్లు వేశారు. వెంకటాయపల్లికి చెందిన హరీష్ గౌడ్ సర్పంచ్ పదవికి భారీ బైక్ ర్యాలీతో నామినేషన్ దాఖలు చేశారు.

# భార్యను చంపి భర్త సూసైడ్!

మెదక్, : మెదక్ జిల్లా టేక్మాల్ మండలం బర్దిపూర్లో దారుణం చోటుచేసుకుంది. శ్రీశైలం (37) తన భార్య మంజుల (34)ను హత్య చేసి, అనంతరం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ దంపతులకు ఒక కుమారుడు ఉన్నాడు. వీరి మరణాలకు గల కారణాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

## కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులకు 6 నెలలే పదవి కాలం

33 జిల్లాల్లో డీసీసీ అధ్యక్షుల ఎంపికలో ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మెన్‌లు వంచి వారికిక ఇవ్వడంతో పాటు కుల సమతుల్యతను పాటించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్లాన్‌తో పార్టీని 2028 అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం చేయాలని రేవంత్ లక్ష్యం. కొన్నిడీసీసీల ఎంపికలో వివాదాలు వచ్చాయి. నల్గొండ డీసీసీ అధ్యక్షుడిగా పున్నా కైలాష్ నేతా నియామకానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి అభ్యంతరం తెలిపారు. అలాగే మహబూబాబాద్ డీసీసీ అధ్యక్షురాలిగా ఎమ్మెల్యే భుక్యా మురళి నాయక్ భార్య భుక్యా ఉమాను నియమించడంతో వెన్నం శ్రీకాంత్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. కరీంనగర్ ఎమ్మెల్యే మెడిపల్లి సత్యం నియామకానికి వెలిచాల రాజేందర్ అంగీకరించలేదు. వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, చిన్నారెడ్డి మధ్య పోటీలో అసలు రేసులో లేని శివసేనా రెడ్డినినియమించారు.

## సోనియా, రాహుల్ గాంధీలపై
# అక్రమ కేసులను ఖండిస్తున్నాం

అన్నారు. "రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా 'ఓటు చోరీ' ప్రచారాన్ని చేపట్టారు. (వారు) పార్లమెంటులో 'ఓటు చోరీ'పై చర్చ జరిపేందుకు ఇష్టపడటం లేదు. అందుకే ఓటు చోరీ నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి సోనియా, రాహుల్ గాంధీపై మళ్ళీ కేసులు వేశారు. బీహార్ ఎన్నికల్లో లోపాలపై చర్చను నివారించడానికి వారు నాలుగు-ఐదు రోజుల క్రితం సోనియా మరియు రాహుల్ గాంధీపై కొత్త కేసు దాఖలు చేశారు" అని రేవంత్ రెడ్డి ఆరోపించారు. "దేశం కోసం సర్వం త్యాగం చేసిన ఘనత గాంధీ కుటుంబానిది దేశం కోసం ప్రాణాలు అర్పించిన కుటుంబం గాంధీ కుటుంబం సొంత ఆస్తులతో నేషనల్ హెరాల్డ్ పత్రిక ప్రారంభించి దేశ స్వాతంత్ర్యంలో గాంధీ కుటుంబం కీలకపాత్ర పోషించింది. నేషనల్ హెరాల్డ్ ఉద్యోగుల కుటుంబాలను ఆదుకునేందుకు ఆర్థికంగా నిలబడేందుకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ కృషి చేశారు. తిరిగి పత్రికను పునరుద్ధరించడానికి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు అవసరమైంది. అందుకే మల్లికార్జున ఖర్గే లాంటి కాంగ్రెస్ ముఖ్య నాయకులను బోర్డు డైరెక్టర్లుగా నియమించి పత్రికను పునరుద్ధరించింది. షేర్ క్యాపిటల్‌కు సంబంధించి కాంగ్రెస్ పార్టీ నుంచి నిధులు బదిలీ చేసి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇచ్చారు. ఇందులో ఏ ఒక్క రూపాయి ప్రభుత్వానికి సంబంధం లేదు. నెహ్రూ వారసత్వంగా వచ్చిన ఆస్తులతో పత్రికను నడిపారు. దానిపై మనీ ల్యాండరింగ్ కేసు పెట్టి సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను వేధిస్తున్నారు. ఓటు చోరీ కార్యక్రమాన్ని రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా తీసుకెళ్లారు. ఆ విషయంపై దృష్టి మరల్చేందుకు మళ్లీ కేసుల పేరుతో హడావుడి చేస్తున్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పై పెట్టిన అక్రమ కేసులను తీవ్రంగా ఖండిస్తూ తీర్మానం చేస్తున్నాం. సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి అండగా నిలబడతామని, అవసరమైతే ఎందాకైనా పోరాడతామని సందేశాన్ని ప్రధాని నరేంద్ర మోదీకి ఇవ్వదలచుకున్నాం" అని రేవంత్ రెడ్డి అన్నారు.

## తెలంగాణ రాజ్‌భవన్ ఇకపై
# 'లోక్ భవన్ - తెలంగాణ'

దీని ప్రకారం ప్రస్తుతం రాజ్‌భవన్, తెలంగాణగా వ్యవహరిస్తున్న తెలంగాణ గవర్నర్ అధికారిక నివాసాన్ని "లోక్ భవన్, తెలంగాణ" అని పిలవనున్నారు."మనం వికసిత్ భారత్ వైపు విశ్వాసంతో ముందుకు సాగుతున్నప్పుడు మన ప్రజాస్వామ్య విలువల బలం, ఉత్సాహాన్ని పునరుద్ఘాటించడానికి ఇది జరిగింది. 'లోక్ భవన్, తెలంగాణ' అనే కొత్త పేరు అన్ని అధికారిక ప్రయోజనాలు, సూచనలు,రికార్డుల కోసం తక్షణమే అమలులోకి వస్తుంది" అని ఆ ప్రకటన పేర్కొంది. వలసవాద వాసనలను తుడిచిపెట్టే ఉద్దేశంలో భాగంగా, రాజ్‌భవన్, రాజ్‌నివాస్‌ల పేర్లను లోక్‌భవన్, లోక్‌నివాస్‌లుగా మార్చే అంశాన్ని పరిశీలించాలని గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లకు సూచిస్తూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ లేఖ రాసింది. అందుకు అనుగుణంగా పశ్చిమ బెంగాల్, తమిళనాడు, గుజరాత్, అసోం, కేరళ, త్రిపుర, ఒడిశా తదితర రాష్ట్రాలు ఉత్తర్వులు జారీ చేశాయి.

## అమరావతిలో రెండో విడత ల్యాండ్ పూలింగ్

అదే విధంగా గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలోని వడ్లమాను, హరిచంద్రపురం, పెద్ద పరిమి అనే మూడు గ్రామాలలో 9,097 ఎకరాలకు ల్యాండ్ పూలింగ్ నోటిఫికేషన్ విడుదల చేశారు.

### ఇటీవల ఏపీ కేబినెట్ ఆమోదం

ఏపీలోని కూటమి ప్రభుత్వం ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. రాజధాని అమరావతి ప్రాంతంలో రెండో విడత ల్యాండ్ పూలింగ్ చేపట్టాలన్న ప్రతిపాదనకు రాష్ట్ర కేబినెట్ గత వారం ఆమోదం తెలిపింది. రెండో దశలో మరో16 వేల ఎకరాల సేకరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సంబంధించిన ప్రక్రియపై కసరత్తు చేపట్టిన ప్రభుత్వం పూర్తి జాబితా సిద్ధం చేసింది. రాజధాని అమరావతి నిర్మాణానికి మొదటి దశలో ప్రభుత్వ భూమి16 వేల ఎకరాలు సీఆర్డీఏకు అప్పగించారు. రాజధాని కోసం రైతుల నుంచి మొత్తం 50 వేల ఎకరాలు భూమి సేకరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా తొలి విడతలో రైతుల నుంచి 34 వేల ఎకరాలను సమీకరించి సీఆర్‌డీఏకు అప్పగించారు. తాజాగా రెండో దశలో మరో 16 వేల ఎకరాల భూమి సేకరించాలని ఇటీవల కేబినెట్ భేటీలో ఆ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది.

# పీఎంవో కాదు ఇక సేవా తీర్థ్

కొత్త భవనంలోకి మారనుంది. ఈ నేపథ్యంలోనే కేంద్రం పేరు మార్పు ప్రకటనను వెలువరించింది. ఇక రాజ్‌భవన్‌ల పేర్లను కూడా లోక్‌భవన్లుగా మార్చింది. సెంట్రల్ విస్టా రీడెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్‌కు సేవా తీర్థ్ అని కేంద్రం పేరు పెట్టింది. ఈ పేరు సేవ స్ఫూర్తిని జాతీయ ప్రాధాన్యతలకు సంబంధించిన పని ప్రదేశాన్ని ప్రతిబింబిస్తుందని కేంద్ర ప్రభుత్వ అధికారులు తెలిపారు. ఇక పూర్తయ్యే దశలో ఉన్న ఈ కొత్త సముదాయంలో పీఎంఓతో పాటు కేబినెట్ సెక్రటేరియట్, జాతీయ భద్రతా మండలి సెక్రటేరియట్, అతిథులతో ఉన్నత స్థాయి చర్చలకు వేదికగా ఉండే ఇండియా హౌస్ కార్యాలయాలు కూడా ఉంటాయి.ప్రధాని మోదీ నాయకత్వంలో.. పాలనా కేంద్రాలకు పేర్లు మార్చడం ద్వారా కర్తవ్య, పారదర్శకతను ప్రతిబింబించేలా సంస్కరణలు జరుగుతున్నాయి. దేశంలోని అన్ని రాష్ట్రాల గవర్నర్ల అధికారిక నివాసాలైన రాజ్ భవన్‌లను కూడా ప్రజాసేవకు అనుగుణంగా లోక్ భవన్‌లుగా మారుస్తున్నారు. అలాగే సెంట్రల్ సెక్రటేరియట్‌కు కర్తవ్య భవన్, రాజ్‌పథ్‌కు కర్తవ్య పథ్ అని పేరు మార్చడం ద్వారా అధికారం అనేది హక్కు కాదు, బాధ్యత అనే సందేశాన్ని ప్రజలకు అందిస్తున్నట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఈ పేరు మార్పులు కేవలం పరిపాలనాపరమైనవే కాకుండా భారతదేశ ప్రజాస్వామ్యం అధికారం నుంచి బాధ్యత వైపు హెూదా నుంచి సేవ వైపు సాగుతున్న భావజాల మార్పును సూచిస్తున్నాయని పేర్కొంటున్నాయి. ప్రభుత్వ భవనాలు, కీలక మార్గాలకు పేరు మార్చడం ద్వారా పాలనా విధానంలో ఒక కొత్త సంస్కృతిని తీసుకురావాలని కేంద్రం చూస్తోంది. గతంలో కార్యాలయాలు విస్తరించి ఉండటం వల్ల కేంద్ర ప్రభుత్వ సమన్వయానికి ఇబ్బందులు ఉండేవి.కానీ సెంట్రల్ విస్టా ప్రాజెక్టులోని ఈ కొత్త కాంప్లెక్స్ ఆ సమస్యను పరిష్కరిస్తుందని కేంద్రం తెలుపుతోంది. కొత్తగా నిర్మించిన ఈ కాంప్లెక్స్‌లో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన కీలక కార్యాలయాలు అన్నీ ఒకే దగ్గర పనిచేయడం ద్వారా అత్యున్నత స్థాయి పాలనలో సమన్వయం మెరుగుపడుతుందని చెబుతోంది. ప్రధానమంత్రి అధికారిక నివాసానికి 2016లోనే లోక్ కళ్యాణ్ మార్గ్ అని పేరు మార్చారు.

# హైదరాబాద్‌లో భారీ స్కాం

స్కామ్‌లో ప్రధాన నిందితుడైన అమర్‌దీప్ కుమార్ కంపెనీకి చెందిన హాకర్ 800ఏ ప్రైవేట్ విమానాన్ని వేలం వేస్తున్నట్లు మంగళవారం ప్రకటించింది. ఈ వేలం ద్వారా వచ్చే మొత్తాన్ని స్కామ్ బాధితులకు నష్టపరిహారంగా చెల్లించనున్నట్లు ఈడీ స్పష్టం చేసింది. ఈడీ కథనం ప్రకారం, ఫాల్కన్ గ్రూప్ పేరుతో అమర్‌దీప్ కుమార్ నకిలీ ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ పథకాన్ని ప్రారంభించి, అనేక మంది నుంచి రూ.792 కోట్లు వసూలు చేసి మోసం చేశాడు. ఈ కేసులో సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం 2025 ఫిబ్రవరి 11న మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయగా, వాటి ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించింది

. అయితే, ఎఫ్ఐఆర్‌లు నమోదు కావడానికి ముందే అమర్‌దీప్ కుమార్ ఇదే విమానంలో దేశం విడిచి పారిపోయినట్లు విచారణలో తేలింది. ప్రస్తుతం అతను పరారీలో ఉన్నాడు.ఈ కేసులో భాగంగా ఈడీ 2025 మార్చి 7న రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ విమానాన్ని స్వాధీనం చేసుకుంది. ప్రస్తుతం ఈ విమానం బేగంపేట ఎయిర్‌పోర్టులో ఉంది. డిసెంబర్ 9న ఎంఎస్టీసీ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ వేలం జరగనుంది. ఆసక్తి ఉన్నవారు డిసెంబర్ 7 వరకు ఈ విమానాన్ని పరిశీలించవచ్చని ఈడీ తెలిపింది. ఈ కేసులో ఇప్పటికే అమర్‌దీప్ సోదరుడు సందీప్ కుమార్, చార్టర్డ్ అకౌంటెంట్ శరద్ చంద్ర తోష్నివాల్, కంపెనీ సీఓఓ ఆర్యన్ సింగ్ ఛాబ్రాలను ఈడీ అరెస్ట్ చేసింది. అలాగే, రూ.18.63 కోట్ల విలువైన ఆస్తులను తాత్కాలికంగా జప్తు చేసింది. విమానం నిర్వహణ ఖర్చులు దాని విలువను మించిపోయే అవకాశం ఉన్నందున, దానిని వేలం వేయడానికి పీఎంఎల్ఏ అడ్జుడికేటింగ్ అథారిటీ నవంబర్ 20న అనుమతి ఇచ్చింది. ఈ కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని ఈడీ అధికారులు తెలిపారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలు - కరీంనగర్‌లో సీపీ గౌష్ ఆలం పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు

**- నామినేషన్ కేంద్రాలు, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో కట్టుదిట్టమైన భద్రత**





కరీంనగర్ / శంకరపట్నం (ప్రశ్న న్యూస్) కరీంనగర్ జిల్లాలో మూడు దశల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రెండో విడత పోలింగ్ ప్రక్రియను శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ గౌష్ ఆలం రెండో విడత నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు, అలాగే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లను మంగళవారం స్వయంగా పర్యవేక్షించారు.

### - రెండో విడత నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

రెండో విడత ఎన్నికలు జరగనున్న తిమ్మాపూర్, శంకరపట్నం,చిగురుమామిడి, గన్నేరువరం,మానకొండూరు మండలాల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ నామినేషన్ కేంద్రాల వద్ద ఏలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ తెలిపారు. నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగేలా భద్రతా ఏర్పాట్లను పలుచోట్ల ఆయన స్వయంగా తనిఖీ చేశారు.

### సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఎన్నికలు సజావుగా సాగేందుకు ముందస్తు చర్యలలో భాగంగా సమస్యాత్మక (ట్రబుల్ స్పాట్స్) పోలింగ్ కేంద్రాలను సీపీ గౌష్ ఆలం సందర్శించారు.తిమ్మాపూర్ మండలంలోని నుస్తుల్లాపూర్, నల్లగొండ, పర్లపల్లి, మొగిలిపాలెం గ్రామాలు:చిగురుమామిడి మండలంలోని రేకొండ, సుందరగిరి, బొమ్మనపల్లి గ్రామాలుబీఅలాగే సైదాపూర్, సోమారం, శంకరపట్నం, తాడికల్ గ్రామాల పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు.పోలింగ్ రోజున ఈ కేంద్రాల వద్ద అదనపు పోలీసు బలగాలను మోహరించి కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని సీపీ స్పష్టం చేశారు.

### బైండోవర్ చర్యలు- ప్రజలు సహకరించాలి

ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమల్లో ఉన్నందున శాంతిభద్రతల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు సీపీ తెలిపారు. గత ఎన్నికల్లో సమస్యలకు కారణమైన వారు, నేర చరిత్ర ఉన్న వ్యక్తులపై ముందస్తుగా బైండోవర్ చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.ఓటర్లు స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా దృఢమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొంటూ, ప్రజలు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని సీపీ గౌష్ ఆలం విజ్ఞప్తి చేశారు. ఈ పర్యవేక్షణలో రూరల్ ఏసీపీ విజయకుమార్, హుజురాబాద్ ఏసీపీ మాధవి,తిమ్మాపూర్ ఇన్‌స్పెక్టర్ సదన్ కుమార్, హుజురాబాద్ రూరల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్,ఎస్సైలు శ్రీకాంత్ (ఎల్ఎండీ), తిరుపతి (సైదాపూర్), సాయికృష్ణ (చిగురుమామిడి)తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## టాస్క్ కేంద్రంలో ఉచిత ఐటీ, బ్యాంకింగ్ కోచింగ్

వరంగల్ ఈస్ట్, : తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) హనుమకొండ ప్రాంతీయ కేంద్రంలో ఐటీ కోర్సులు (జావా, పైథాన్, వెబ్ డెవలప్మెంట్, సీ లాంగ్వేజ్, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ) మరియు బ్యాంకింగ్ పరీక్షల ప్రిపరేషన్ కోసం ఉచిత కోచింగ్ ఇవ్వబడుతుంది. వృత్తివిద్య అభ్యసించిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ కేంద్రం పనిచేస్తుంది. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 10వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

## ఏనుమాముల మార్కెట్ లో హమాలి కార్మికుల ధర్నా

వర్ధన్నపేట, : సివిల్ సప్లైలో పనిచేస్తున్న హమాలీలు తమ కూలి రేట్లు పెంచాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ గోదాముల ముందు ఆందోళన చేపట్టారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి రేట్లు పెంచే విధానాన్ని ప్రభుత్వం పాటించడం లేదని, అధికారులు పట్టించుకోవడం లేదని కార్మికులు ఆరోపించారు. సివిల్ సప్లై హమాలీలను ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు.

## సీఎం రాకపై భారీ బందోబస్తు ఏర్పాట్లు

పరకాల, : వరంగల్ జిల్లా నర్సంపేటకు ఈ నెల 5న సీఎం రేవంత్ రెడ్డి రానున్న సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, ఎమ్మెల్యే మాధవరెడ్డి సభాస్థలిని పరిశీలించారు. సభావేదిక, సభా మైదానం ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అధికారుల వెంట ఎస్పీ జితేందర్ రెడ్డి, డీసీపీ అంకిత్ కుమార్, ఏసీపీ రవీందర్ రెడ్డి, సీఐ రఘుపతి రెడ్డితో పాటు స్థానిక పోలీసులు ఉన్నారు.

## కల్వల వసతి గృహ సిబ్బందిపై చర్యలు!

ములుగు, : మండలంలోని కల్వల ఆదర్శ పాఠశాల వసతి గృహంలో గత నెల 20న కిచిడిలో పురుగులున్నాయని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించడం లేదంటూ విద్యార్థినులు ఆందోళన చేశారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణ చేయించి పొరుగుసేవల విధానంలో పనిచేస్తున్న వసతి గృహ కేర్‌టేకర్‌తో పాటు ముగ్గురు వంట మనుషులను విధుల్లో నుంచి తొలగిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. 20వ తేదీన బాలికల ఆందోళన నేపథ్యంలో తహసీల్దారు, ఎంపీడీవో, జీసీడీవో వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తామన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ కూడా ఈ వసతి గృహాన్ని సందర్శించి బాలికలకు కల్పిస్తున్న వసతులపై అసంతృప్తి వ్యక్తం చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రిజర్వేషన్ మార్చాలని కోర్టుకెళ్లిన గ్రామస్థులు

భూపాలపల్లి, : వంజరుపల్లి గ్రామంలో సర్పంచి స్థానంతో పాటు 3 వార్డుల్లో రిజర్వేషన్ మార్చాలని లేదా ఎన్నికలను నిలిపివేయాలని కోరుతూ గ్రామానికి చెందిన తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వంజరుపల్లిలో ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు లేనప్పటికీ సర్పంచి స్థానంతో పాటు 1, 4, 6 వార్డులను ఎస్టీ సామాజిక వర్గానికి కేటాయించారు. దీన్ని మార్చాలని కోరుతూ శ్రీనివాస్ అక్టోబరు నెలలో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఎన్నికలు వాయిదా పడడంతో సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి రిజర్వేషన్ మార్చాలని కోరారు. ప్రభుత్వం రిజర్వేషన్లు మార్చకుండా వంజరుపల్లిలో సర్పంచి స్థానాన్ని యథాతథంగా ఎస్టీ సామాజిక వర్గానికి కేటాయించింది.

## హనుమకొండ జిల్లాలో విద్యార్థినిపై రసాయనంతో దాడి

జనగామ, : ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న నర్సింగ్ కళాశాల విద్యార్థిని కాళ్లపై అకస్మాత్తుగా గుర్తు తెలియని రసాయనం పడి గాయాలైన ఘటన హనుమకొండ జిల్లా కాజీపేట సమీపంలోని కడిపికొండలో సాయంత్రం చోటుచేసుకుంది. జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం వడ్డెగూడెనికి చెందిన తాటికాయల సునంద (19) ఐనవోలు మండలంలోని వెంకటాపూరంలోని అమ్మమ్మ వద్ద ఉంటోంది. ఈ విద్యార్థిని హనుమకొండలోని ఓ ప్రైవేటు నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. రోజూ బస్సులో కళాశాలకు వెళ్లే విద్యార్థిని, స్కూటీపై వెళ్లి, అక్కడి నుంచి అమ్మమ్మ ఉండే వెంకటాపూర్‌కు తిరుగు ప్రయాణమైంది.

## రిమ్స్ ఆసుపత్రిలో కార్మికుల నిరసన



ఆదిలాబాద్, : ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు కుంటాల రాములు డిమాండ్ చేశారు. మంగళవారం రిమ్స్ ఇన్ పేషెంట్ బ్లాక్ ఎదుట నిరసన తెలిపిన నాయకులు, పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఈఎస్ఐతో పాటు ఒక నెల వేతనం వెంటనే చెల్లించాలని కోరారు. సీనియార్టీ ప్రకారం కార్మికులకు ప్రమోషన్స్ కల్పించాలని కూడా వారు పేర్కొన్నారు.

## ఆదిలాబాద్‌లో పి. డి. ఎస్. యు 20వ జిల్లా మహాసభ

బోథ్, : పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. వి. శ్రీకాంత్ మాట్లాడుతూ, జార్జి రెడ్డి స్ఫూర్తితో విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని సంఘం కార్యాలయంలో పి.డి.ఎస్.యు 20వ జిల్లా మహాసభలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, పి.డి.ఎస్.యు జిల్లా కార్యదర్శి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## హెూమ్ గార్డ్ రాజేశ్వర్ హఠాన్మరణం

నిర్మల్, : నిర్మల్ పోలీస్ హెూమ్ గార్డ్ ఎన్. రాజేశ్వర్ అర్ధరాత్రి గుండెపోటుతో మరణించారు. ఆయన జిల్లా పోలీస్ కళా బృందంలో చురుగ్గా పాల్గొని, తన కళా నైపుణ్యాలతో ప్రజలకు అనర్థాలపై అవగాహన కల్పించారు. మంగళవారం జరిగిన ఆయన అంతిమ యాత్రలో పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని నివాళులర్పించారు.

## బైంసా పట్టణంలో ప్రజావాణి కార్యక్రమం

ముథోల్, : ప్రజల సౌలభ్యం కోసం బైంసా పట్టణంలో బుధవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ జానకి షర్మిల మంగళవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు బైంసా క్యాంప్ ఆఫీస్ లో నేరుగా ఎస్పీకి అర్జీలు, ఫిర్యాదులు సమర్పించవచ్చని పేర్కొన్నారు. బైంసా సబ్ డివిజనల్ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## డిగ్రీ పరీక్ష ఫీజు చెల్లించాలని విశ్వవిద్యాలయం ప్రకటన

ఖానాపూర్, : నిర్మల్ లోని అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ల పరీక్ష ఫీజు చెల్లించాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం సుధాకర్ మరియు కో ఆర్డినేటర్ డాక్టర్ యు గంగాధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు థియరీ మరియు ప్రాక్టికల్ పరీక్ష ఫీజు కట్టాలని వారు సూచించారు. ఈ ప్రకటన ద్వారా విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లింపుపై అవగాహన కల్పించారు.

## 10 మంది విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు



కరీంనగర్, : డిసెంబర్ 22 జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా, 2025 డిసెంబర్ 2న మంగళవారం హుజురాబాద్‌లోని గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎల్కతుర్తి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న 70 మంది విద్యార్థులకు గణిత ఒలంపియాడ్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన మొదటి పది మంది విద్యార్థులకు ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్, ఇన్చార్జ్ ప్రిన్సిపల్ వి. లలిత చేతుల మీదుగా శంకర్ నారాయణ డిక్షనరీలను ప్రతిభ పురస్కారాలుగా అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం జి. రాజశ్రీ, పి. శ్రీధర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోతుల బెడదపై ఓటర్ల వినూత్న డిమాండ్:

మానకొండూరు, : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎన్నికల ప్రచారానికి వెళ్తున్న అభ్యర్థులకు ప్రజలు వినూత్న డిమాండ్‌లు చేస్తున్నారు. తమ గ్రామాల్లో కోతుల సమస్యను పరిష్కరించిన వారికే ఓట్లేస్తామని ఓటర్లు తేల్చి చెబుతున్నారు. జిల్లాలోని అనేక గ్రామాల్లో మనుషుల కంటే కోతుల సంఖ్య అధికంగా ఉండటంతో ప్రజలు బయట తిరగడానికి భయపడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించడమే అభ్యర్థులకు పెద్ద సవాల్‌గా మారింది.

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

చొప్పదండి, : కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్, కొత్తపల్లి గ్రామపంచాయతీలలో రెండవ విడత నామినేషన్ల ప్రక్రియను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని, నామినేషన్లను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఆమె వెంట జిల్లా అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## జర్నలిస్టుల సమస్యలపై డిసెంబర్ 3న హైదరాబాద్‌లో మహా ధర్నా

హుజూరాబాద్, : రాజన్న సిరిసిల్ల జిల్లా మానకొండూర్ నియోజకవర్గం ఇల్లంతకుంట మండలంలో, జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 3న హైదరాబాద్‌లో మహా ధర్నా నిర్వహించనున్నట్లు టీయూడబ్ల్యూజే మండల అధ్యక్షుడు మారుపాక అనిల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయాలని, ఆరోగ్య భీమా పథకాన్ని పునరుద్ధరించాలని, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, వృత్తి కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. డిసెంబర్ 3న హైదరాబాద్ మసాబ్ ట్యాంక్‌లోని రాష్ట్ర సమాచార కమిషనర్ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ మహా ధర్నాలో రాష్ట్ర, జాతీయ, జిల్లా, మండల నాయకులు, యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఇంచార్జి కలెక్టర్

వేములవాడ, : రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం బోయినపల్లిలోని ఆర్ఓ కేంద్రంలో గ్రామ పంచాయతీ రెండో విడత ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. నామినేషన్ తోపాటు అభ్యర్థి నూతన బ్యాంక్ ఖాతా తప్పనిసరి అని, అన్ని వివరాలు నింపాలని ఆమె తెలిపారు. తుది జాబితా ప్రకటించాక అభ్యర్థులకు ఎన్నికల నియమావళి, వ్యయంపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. హెల్ప్ డెస్క్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను కూడా తనిఖీ చేసి, ఏర్పాట్లపై సూచనలు చేశారు.

## సిరిసిల్లలో నిరుపేద కుటుంబం గొర్రెలు దొంగిలించబడ్డాయి

సిరిసిల్ల, : సిరిసిల్ల మున్సిపాలిటీ 10వ వార్డు ముష్టిపెల్లిలో నిన్న అర్ధరాత్రి దొంగలు యాదవ కుటుంబానికి చెందిన కర్తల ఎల్లవ్వ, దేవయ్య గారి 3 గొర్రెలను దొంగిలించారు. సమాచారం అందుకున్న మాజీ కౌన్సిలర్ బోల్గం నాగరాజు గౌడ్ సంఘటన స్థలానికి చేరుకుని సీఐకి తెలియజేశారు. నిరుపేద కుటుంబమైన దేవయ్య గారు గల్ఫ్ నుంచి అనారోగ్యంతో తిరిగి వచ్చి అప్పు చేసి కొనుగోలు చేసిన గొర్రెలతో జీవనం సాగిస్తున్నారని, ప్రభుత్వం న్యాయం చేయాలని, దొంగలను పట్టుకుని చర్యలు తీసుకోవాలని కోరారు. వార్డు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఖమ్మం, : ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తిరుమలాయపాలెం మండలం బీరోలుకు చెందిన బట్టల వ్యాపారి కూరపాటి వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేశ్వర్లు బైక్ పై వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న గ్రానైట్ లారీ ఢీకొట్టింది. లారీ చక్రాల కిందపడిపోయి తల నుజ్జునుజ్జు అయి మృతిచెందాడని స్థానికులు తెలిపారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## తల్లాడ ఎంపీడీవో కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్ అజయ్ యాదవ్ తనిఖీ

మధిర, : స్థానిక ఎన్నికల నేపథ్యంలో, డిప్యూటీ కలెక్టర్ అజయ్ యాదవ్ తల్లాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి, అధికారులకు కీలక సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కోర్టు స్టేతో నిలిచిపోయిన సాధారణ ఏన్కూర్ పంచాయతీ ఎన్నికలు

వైరా, : 1956లో ఏర్పడిన ఏన్కూర్ గ్రామపంచాయతీతో పాటు జన్నారం, ఆరికాయలపాడు, నాచారం గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు నిలిచిపోయాయి. 69 ఏళ్ల క్రితం మొదటి సర్పంచి ఎన్నికైన ఏన్కూరులో, 2025 డిసెంబర్‌లో జరగాల్సిన సాధారణ ఎన్నికలకు జనరల్ అభ్యర్థులు పోటీ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కొందరు కోర్టును ఆశ్రయించడంతో, కోర్టు స్టే ఆర్డర్ కారణంగా ఎన్నికల కమిషన్ ఎన్నికలను నిలిపివేసింది. ఈ నాలుగు పంచాయతీల్లో కోర్టు స్టే ఆర్డర్ ఉన్నందున ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదని అధికారులు తెలిపారు. దీంతో ఎన్నికల వాతావరణం కనిపించకపోవడంతో స్థానికులు ఆశ్చర్యంగా చర్చించుకుంటున్నారు.

## మల్లవరం సర్పంచ్ ఎన్నికల్లో కిరణ్ కుమార్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ

పాలేరు, : తల్లాడ మండలం మల్లవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులు కటికి కిరణ్ కుమార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఈ నెల 4వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు.

## తల్లాడ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిగా దగ్గుల రఘుపతి రెడ్డి నామినేషన్

సత్తుపల్లి, : తల్లాడ మేజర్ పంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరపున సర్పంచ్ అభ్యర్థిగా దగ్గుల రఘుపతి రెడ్డి నామినేషన్ వేయడానికి సిద్ధంగా ఉన్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాప సుధాకర్ తెలిపారు. ఈనెల 4వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్న నేపథ్యంలో, కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై మద్దతు తెలపాలని ఆయన కోరారు.

## అభయ ఆంజనేయస్వామి ప్రాంగణంలో మహా అన్నదానం, భక్తుల సందడి



నర్సంపేట, : నిజాంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని బాచుపల్లిలో గల అభయ ఆంజనేయస్వామి ప్రాంగణంలో ప్రతి మంగళవారం మహా అన్నదాన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించబడుతోంది. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. భక్తుల సందోహంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. ఈ సేవ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

## శాసనసభాపతి మధుసూదనాచారి పరామర్శ



వరంగల్ వెస్ట్, : చిట్యాల మండల కేంద్రానికి చెందిన కోడల సమ్మయ్య, కల్వచర్ల కృష్ణమూర్తి అనారోగ్యంతో మృతి చెందారు. వారి పార్థివ దేహాలను సందర్శించిన తెలంగాణ శాసనసభాపతి, శాసనమండలి ప్రతిపక్ష నేత ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మృతుల కుటుంబాలను పరామర్శించి, వారికి మనోధైర్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# మరింతగా వణికించే శీతాకాలం

న్యూఢిల్లీ : ఈ శీతాకాలంలో దేశంలోని పలు ప్రాంతాలు మరింత చలితో వణికిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. 'చలిగాలి రోజులు' సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశాలున్నాయి. ఈ విషయాన్ని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సోమవారం వెల్లడించింది. ఢిల్లీ, హర్యానా, పంజాబ్, తూర్పు యూపీ, ఉత్తర మధ్యప్రదేశ్, పడమటి మహారాష్ట్ర, అరుణాచల్ ప్రదేశ్‌లలో ఈ ప్రభావం ఎక్కువ ఉండనున్నదని తెలిపింది. చలి గాలుల నిర్వచనాన్ని కూడా ఐఎండీ స్పష్టం చేసింది. మైదాన ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రత 10 డిగ్రీలు లేదా అంతకంటే తక్కువ, కొండ ప్రాంతాల్లో 0 డిగ్రీలు లేదా అంతకంటే తక్కువగా ఉంటే దానిని చలిగాలి రోజుగా పరిగణిస్తారు. అలాగే సాధారణ కనిష్ట ఉష్ణోగ్రత కంటే 4.5 నుంచి 6.4 డిగ్రీలు తగ్గినా అదే కోవలోకి వస్తుంది. డిసెంబర్-ఫిబ్రవరి మధ్య కనిష్ట ఉష్ణోగ్రతలు దేశంలోని కేంద్ర, సమీప ద్వీపకల్ప, వాయువ్య ప్రాంతాల్లో సాధారణం నుంచి తక్కువగా ఉండే అవకాశాలు ఉన్నాయి. మిగిలిన ప్రాంతాల్లో మాత్రం కొద్దిగా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నది. చలిగాలుల పెరుగుదలకు వెస్టర్న్ డిస్టర్బెన్సెస్ తగ్గడం ప్రధాన కారణమని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర తెలిపారు. అలాగే ప్రస్తుత సంవత్సరం లా నినా ప్రభావంలో ఉండడం కూడా చలిగాలుల పెరుగుదలకు కారణమవుతుందని వివరించారు. చలి తీవ్రత పెరుగుదల హెచ్చరికల నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని వైద్య, ఆరోగ్య నిపుణులు ప్రజలకు సూచిస్తున్నారు. మరీముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఉదయం, రాత్రి సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని అంటున్నారు.

# ధన్‌ఖడ్ ఎందుకు రాజీనామా చేశారు?

న్యూఢిల్లీ : రాజ్యసభ ఛైర్మన్‌గా తొలిసారి సభలో అడుగుపెట్టిన ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున ఖర్గే స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ ఛైర్మన్.. ధన్‌ఖడ్ ఆకస్మికంగా వైదొలగడాన్ని ఆయన ప్రస్తావించడంతో అధికారపక్ష సభ్యులు అభ్యంతరం తెలిపారు. సోమవారం సభలో ఖర్గే కొద్దిసేపు మాట్లాడారు. ఇరు పక్షాల మధ్య సమతూకం పాటించాలని, ప్రతిపక్ష సభ్యులు సమస్యలను లేవనెత్తడానికి అవకాశం ఇవ్వాలని కొత్త ఛైర్మన్‌ను కోరారు. రాధాకృష్ణన్.. కాంగ్రెస్ కుటుంబం నుంచి వచ్చిన వారేనని తెలిపారు. సభ సజావుగా సాగడానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా.. జులై 21న ధన్‌ఖడ్ ఆకస్మికంగా రాజీనామా చేయడాన్ని ఖర్గే ప్రశ్నించారు. పార్లమెంటరీ చరిత్రలోనే ఇదో అనూహ్య పరిణామమని అభిప్రాయపడ్డారు. ఆయనకు వీడ్కోలు పలికే కార్యక్రమాన్నీ నిర్వహించకపోవడం తనను బాధించిందని తెలిపారు. తమపై ప్రధాని మోదీ సభ బయట ఆరోపణలు చేశారని, దానికి తాము సభలోనే బదులిస్తామని స్పష్టం చేశారు. ఖర్గే వ్యాఖ్యలతో అధికార పక్ష సభ్యులు భగ్గుమన్నారు. కొత్త ఛైర్మన్‌ను స్వాగతించే కార్యక్రమంలో ధన్‌ఖడ్ పేరును ఖర్గే తీసుకురావడాన్ని పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు తప్పుబట్టారు. గతంలో ధన్‌ఖడ్‌ను అవమానించిన ఘటనలకు సంబంధించిన సాక్ష్యాలు తమవద్ద ఉన్నాయని స్పష్టం చేశారు. కేంద్రమంత్రి నడ్డా జోక్యం చేసుకుని సభ్యులు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ధన్‌ఖడ్ ప్రస్తావన అసమంజసమని అభిప్రాయపడ్డారు.

# కనిష్ట స్థాయికి రూపాయి విలువ

మనదేశ కరెన్సీ రూపాయి విలువ ఆల్‌టైమ్ కనిష్టానికి చేరింది. దేశీయ ఈక్విటీ మార్కెట్లలో



ప్రతికూల ధోరణి, విదేశీ నిధుల ఉపసంహరణ కారణంగా సోమవారం అమెరికా డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 34 పైసలు క్షీణించి ఆల్‌టైమ్ కనిష్ట స్థాయి రూ. 89.79కి చేరుకుంది. డాలర్ బలంగా ఉండటం, అంతర్జాతీయ ముడి చమురు ధరల పెరుగుదల భారత కరెన్సీని దెబ్బతీశాయని ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు. మరోవైపు, దిగుమతిదారుల నుంచి డాలర్ డిమాండ్ కూడా మన కరెన్సీపై ఒత్తిడి పెంచింది. ఈ వారం ఇంటర్‌బ్యాంక్ విదేశీ ద్రవ్య మార్కెట్లో రూపాయి రూ. 89.45 వద్ద ప్రారంభమైంది. ఆ తర్వాత మరింత బలహీనపడి రూ. 89.79కి పడిపోయింది. ఎఫ్‌పీఐలు మన మార్కెట్ల నుంచి నిధులను వెనక్కి తీసుకోవడం, అధిక వాల్యూయేషన్, చమురు బంగారం కొనుగోళ్ల కారణంగా రూపాయి ఒత్తిడిలోకి చేరిందని ఫిన్‌రెక్స్ ట్రెజరీ అడ్వైజర్ ఎల్‌ఎల్‌పీ హెడ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనిల్ కుమార్ భన్సాలి అన్నారు. అమెరికాతో వాణిజ్య చర్చల ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయని, ఏడాది చివరి నాటికి పరిష్కారం లభిస్తుందనే అంచనాలున్నాయని ఆయన పేర్కొన్నారు. సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. ఉదయం సానుకూలంగానే ట్రేడింగ్ మొదలైనప్పటికీ కొద్దిసేపటి తర్వాత నష్టాల్లోకి జారాయి. ఇందుకు ప్రధానంగా ఆర్‌బీఐ రేటు తగ్గింపుపై అంచనాలు తగ్గడం, బలమైన జీడీపీ వృద్ధి, తక్కువ ద్రవ్యోల్బణ పరిస్థితుల మధ్య సెంట్రల్ బ్యాంకు రేట్లను స్థిరంగా ఉంచవచ్చనే ఊహాగానాలు పెరిగాయి. దీనికి తోడు రూపాయి జీవితకాల కనిష్టానికి చేరడం, అమెరికాతో వాణిజ్యంపై ఆందోళనలు మార్కెట్ల బలహీనతకు కారణమయ్యాయి. దీంతో మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 64.77 పాయింట్లు పడిపోయి 85,641 వద్ద, నిఫ్టీ 27.20 పాయింట్లు తగ్గి 26,175 వద్ద ముగిశాయి. సెన్సెక్స్ ఇండెక్స్‌లో టీఎంపీవీ, మారుతీ సుజుకి, బీఈఎల్, కోటక్ బ్యాంక్, అదానీ పోర్ట్స్ షేర్లు లాభాలను దక్కించుకున్నాయి. బజాజ్ ఫైనాన్స్, సన్‌ఫార్మా, ట్రెంట్, ఎస్‌బీఐ, బజాజ్ ఫిన్‌సర్వ్, భారతీ ఎయిర్‌టెల్ స్టాక్స్ నష్టాలను నమోదు చేశాయి.

# పారిశ్రామికోత్పత్తి మందగమనం

దేశ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైన పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) మందగించింది.



ప్రజల ఆదాయాలు సన్నగిల్లడంతో డిమాండ్ పడిపోవడంతో అంతిమంగా పారిశ్రామిక ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం పడుతోంది. ముఖ్యంగా విద్యుత్, మైనింగ్, తయారీ రంగాలు అత్యంత పేలవమైన డిమాండ్‌ను చవి చూశాయి. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది అక్టోబర్‌లో పారిశ్రామికోత్పత్తి సూచీ 0.4 శాతానికి మందగించింది. కేంద్ర గణాంకాల శాఖ (ఎన్ఎస్ఓ) సోమవారం విడుదల చేసిన రిపోర్ట్ ప్రకారం.. ఐఐపీ 0.4 శాతానికి పరిమితమై ఏడాది కనిష్ట స్థాయిని చవి చూసింది. 2024 అక్టోబర్‌లో 3.7 శాతం వృద్ధిని కనబర్చింది. ఈ ఏడాది సెప్టెంబర్ ఐఐపీ గణాంకాలను 4 శాతం నుంచి 4.6 శాతానికి సవరించింది. ఐఐపీలో ప్రధానమైన తయారీ రంగం 2025 అక్టోబర్‌లో 1.8 శాతం పెరుగుదలతో సరిపెట్టుకుంది. గతేడాది ఇదే నెలలో తయారీ రంగం 4.4 శాతం వృద్ధిని సాధించింది. ఇదే నెలలో మైనింగ్ ఉత్పత్తి మైనస్ 0.9 శాతంగా ఉండగా.. గడిచిన అక్టోబర్‌లో రెట్టింపై మైనస్ 1.8 శాతానికి క్షీణించింది. విద్యుత్ ఉత్పత్తి 2024 అక్టోబర్‌లో మైనస్ 2 శాతంగా ఉండగా.. 205 అక్టోబర్‌లో మరింత పతనమై మైనస్ 6.9 శాతానికి కుంచించుకుపోయింది. క్యాపిటల్ గూడ్స్ విభాగం 2.4 శాతానికి తగ్గగా.. ఏడాది క్రితం 2.9 శాతం పెరుగుదల ఉంది. కన్స్యూమర్ డ్యూరెబుల్స్ ఉత్పత్తి 4.4 శాతం నుంచి 2.8 శాతానికి పడిపోయింది. తయారీ రంగంలో 23 పరిశ్రమల విభాగాల్లో 9 మాత్రమే సానుకూల వృద్ధిని నమోదు చేశాయి. ఆర్థిక సంవత్సరం 2025-26 ఏప్రిల్-అక్టోబర్ కాలంలో దేశ పారిశ్రామిక ఉత్పత్తి 2.7 శాతానికి పడిపోయింది. గతేడాది ఇదే కాలంలో 4 శాతం పెరుగుదల చోటు చేసుకుంది.

# ప్రస్తుతం ప్రభుత్వం ముందు బ్యాంకుల విలీన ప్రతిపాదన లేదు:



ప్రభుత్వ బ్యాంకుల విలీన ప్రక్రియకు సంబంధించి ప్రస్తుతానికి ప్రభుత్వం ముందు ఎటువంటి ప్రతిపాదన లేదని సోమవారం ఆర్థిక శాఖ పార్లమెంటుకు సమాచారం అందించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభకు లిఖితపూర్వక సమాధానంగా చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 2020లో ప్రభుత్వ రంగ బ్యాంకులను 27 నుంచి 12కి తగ్గించింది. ఆ తర్వాత మళ్లీ ఇటీవల మరోసారి చిన్న పీఎస్‌బీలను పెద్ద బ్యాంకుల్లో చేయవచ్చనే కథనాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే బ్యాంకు డిపాజిటర్లతో పాటు ఉద్యోగులు, వాటాదారులలో నెలకొన్న సందేహాలను తొలగిస్తూ ఆర్థిక శాఖ స్పష్టత ఇచ్చింది. మరొక ప్రశ్నకు సమాధానమిచ్చిన పంకజ్ చౌదరి.. ఐసీఈఏ ఆమోదం ప్రకారం ఐడీబీఐ బ్యాంక్‌లో పెట్టుబడుల ఉపసంహరణ జరుగుతుందని తెలిపారు. ఐడీబీఐ బ్యాంకులో పెట్టుబడుల ఉపసంహరణతో పాటు నిర్వహణ నియంత్రణ అధికారాన్ని కూడా బదిలీ చేసేందుకు 2021లోనే ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ(సీసీఈఏ) ఆమోదం తెలిపింది. ఐడీబీఐ బ్యాంకులో ఎల్‌ఐసీ, ప్రభుత్వానికి కలిపి 94.72 శాతం వాటా ఉంది. ఇందులో 60.72 శాతం వాటాను విక్రయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కాగా, ఈ ఏడాది మార్చి నాటికి ఐడీబీఐ బ్యాంకు దాదాపు రూ. 4.11 లక్షల కోట్ల బకాయిలు ఉండగా, అంతే మొత్తంలో ఆస్తులు కూడా ఉన్నాయని పంకజ్ చౌదరీ పేర్కొన్నారు.

# ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ బ్రాండ్ అంబాసిడర్లుగా రణ్‌బీర్, రష్మిక




ఇటీవల యూనివర్సల్ బ్యాంకుగా భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) నుంచి ప్రాథమిక ఆమోదం పొందిన ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు కీలక నిర్ణయం తీసుకుంది. సినీ నటులు రణ్‌బీర్ కపూర్, రష్మిక మందన్నలను బ్యాంకు బ్రాండ్ అంబాషిడర్లుగా నియమించినట్లు సోమవారం ప్రకటనలో తెలిపింది. పట్టణ, మెట్రో సహా దేశవ్యాప్తంగా మార్కెట్లలో మరిన చొచ్చుకుపోయి, ప్రాధాన్యత కలిగిన జాతీయ బ్యాంకింగ్ బ్రాండ్‌ను నిర్మించాలనే ప్రయత్నంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది. సేవింగ్స్ అకౌంట్లు, కరెంట్ ఖాతాలలో మరింత ప్రాధాన్యతను పెంచడంపై దృష్టి సారించేందుకు ఈ సహకారం బలపరుస్తుందని బ్యాంకు తెలిపింది. యూనివర్సల్ బ్యాంకుగా ఎదిగేందుకు మేము సిద్ధమవుతున్నాం. బ్యాంకు అందించే ఆఫర్‌లను కస్టమర్లకు మరింత చేరువ చేయడానికి ఈ సమయం ఎంతో కీలకం. ఇందుకు రణ్‌బీర్, రష్మిక దేశంలోని వివిధ ప్రాంతాలతో, అనేక మార్గాల్లో లోతుగా కనెక్ట్ అవుతారని ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఎండీ, సీఈఓ సంజయ్ అగర్వాల్ అన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా బ్రాండ్ విలువను పెంచడం, కీలక మార్కెట్లలో విస్తరణకు వీలవుతుందని, బ్యాంకు తదుపరి దశ వృద్ధికి ఊతమిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# పెట్టుబడి నిర్ణయాలపై ఎల్ఐసీకి ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలు ఇవ్వదు:



ప్రభుత్వ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ)కి ఎలా పెట్టుబడి పెట్టాలనే దానిపై ఎటువంటి సలహా లేదా దిశానిర్దేశం ఇవ్వలేదని ఆర్థిక మంత్రిత్వ శాఖ సోమవారం స్పష్టం చేసింది.ఎల్ఐసీ తీసుకునే పెట్టుబడి నిర్ణయాలు స్వతంత్రంగా ఉంటాయని, కఠినమైన చర్యలు, రిస్క్ అంచనా, సరైన అనుమతుల ద్వారానే జరుగుతాయి. బీమా చట్టం-1938 నిబంధనలు, అలాగే ఐఆర్‌డీఏఐ, ఆర్‌బీఐ, సెబీ నిబంధనల ఆధారంగా ఎల్ఐసీ పెట్టుబడులు పెడుతుంది. ఈ విషయం గురించి లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. మంత్రిత్వ శాఖ లేదా ఆర్థిక సేవల విభాగం, ఎల్ఐసీ లేదా ఇతర ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థలకు అదానీ గ్రూప్ కంపెనీలలో పెట్టుబడి పెట్టడంపై ఎలాంటి ఆదేశాలు లేదా సలహాలు ఇవ్వలేదని స్పష్టం చేశారు. అదానీ గ్రూప్ కంపెనీల్లో పెట్టుబడులకు సంబంధించి ఎల్ఐసీకి ఆర్థిక మంత్రిత్వశాఖ ఆదేశాలిచ్చినట్టు అమెరికాకు చెందిన వాషింగ్టన్ పోస్ట్ రెండు నెలల క్రితం కథనం వెలువరించిన సంగతి తెలిసిందే.

దీన్ని ఎల్ఐసీ ఖండించింది. పెట్టుబడులు పూర్తిగా తమ సొంత నిర్ణయమని ప్రకటన జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే పార్లమెంట్‌లో అడిగిన ఓ ప్రశ్నకు నిర్మలా సీతారామన్ సమాధానమిచ్చారు. ఎల్ఐసీ పెట్టుబడులకు సంబంధించి సొంతంగానే నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. ఎల్ఐసీ పెట్టుబడులు ఎన్ఎస్ఈ, బీఎస్ఈలలోని టాప్ 500 కంపెనీలలో పెట్టుబడి పెడుతుందని ఆర్థిక మంత్రి చెప్పారు. ప్రస్తుతం ఎల్ఐసీ పెట్టుబడుల్లో ఎక్కువ భాగం పెద్ద కంపెనీలలో ఉన్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 30 నాటికి నిఫ్టీ 50 కంపెనీలలో ఎల్ఐసీ పెట్టుబడుల విలువ రూ. 4.31 లక్షల కోట్లు, ఇది మొత్తం ఈక్విటీ పెట్టుబడిలో 45.85 శాతానికి సమానమని వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ డెట్ సెక్యూరిటీలలోని పెట్టుబడులను కలుపుకుంటే ఇది రూ. 9.4 లక్షల కోట్లు ఉంటాయని నిర్మలా సీతారామన్ చెప్పారు.

# నవంబరులో వాహన విక్రయాల రికార్డు



పండగ సీజన్ తరవాతా కొనుగోలుదార్ల నుంచి గిరాకీ బాగుండటంతో, గత నెలలో వాహన టోకు విక్రయాలు పెరిగాయి. దిగ్గజ సంస్థలు మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా 2024 నవంబరుతో పోలిస్తే, గత నెలలో బలమైన గణాంకాలను నమోదు చేశాయి. మారుతీ సుజుకీ ఇండియా 40 ఏళ్లలోనే అత్యధికంగా నవంబరులో 2,29,021 వాహనాలను విక్రయించింది. ఇందులో దేశీయ డీలర్లకు 1,70,971 వాహనాలను సరఫరా చేసింది. 2024 నవంబరులో సరఫరా చేసిన 1,41,312 వాహనాలతో పోలిస్తే ఇవి 21% అధికం. ఎగుమతులు 28,633 నుంచి 46,057కు పెరిగాయి. తేలికపాటి వాణిజ్య వాహనం సూపర్ క్యారీ వాహనాలు 3622 అమ్ముడయ్యాయి. చిన్న కార్లు, స్పోర్ట్స్ వినియోగ వాహనాల (ఎస్‌యూవీ)తో పాటు అన్ని విభాగాల్లో సంస్థ వృద్ధి కనబరిచింది. పెండింగ్‌లోనే 1.50 లక్షల కార్లు: నవంబరులో రిటెయిల్ వృద్ధి 31 శాతమని మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి (మార్కెటింగ్, విక్రయాలు) పార్థో బెనర్జీ వెల్లడించారు. చిన్న కార్లలో ఎస్‌ప్రెసో, ఆల్టో, కె10, సెలెరియో, వ్యాగన్‌ఆర్ విక్రయాల్లో 37% వృద్ధి నమోదైందని తెలిపారు. తమ మొత్తం వాహన విక్రయాల్లో ఎస్‌యూవీల వాటా 30 శాతమని పేర్కొన్నారు. ప్రస్తుతం 8 మోడళ్ల నిల్వలు లేవని, బుకింగ్‌లు సుమారు 1.5 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. కార్లకు గిరాకీ బలంగా ఉంటుందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పరిశ్రమ 5-6% వృద్ధి నమోదు చేస్తుందని అభిప్రాయపడ్డారు.

# వివాదంలో హర్షిత్ రాణా..



ఇండియా-సౌతాఫ్రికా వన్డే మ్యాచ్‌లో హర్షిత్ రాణా, విరాట్ కోహ్లీ వివాదాస్పద ప్రవర్తనకు సంబంధించిన సంఘటన సోషల్ మీడియాలో చర్చకు కారణమైంది. తమ భావోద్వేగాలను అదుపు చేసుకోలేక ప్రత్యర్థి ఆటగాడిపై నోరు పారేసుకున్నారు. సౌతాఫ్రికాతో రాంచీ వేదికగా ఆదివారం జరిగిన తొలి వన్డేలో ఈ ఘటన చోటు చేసుకుంది. అయితే ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా బ్యాటర్ డెవాల్డ్ బ్రెవిస్ ఔటైన తర్వాత హర్షిత్ రాణా, విరాట్ కోహ్లీ చేసుకున్న సంబరాలు వివాదాస్పదమయ్యాయి.ముఖ్యంగా హర్షిత్ రాణా ప్రత్యర్థి ఆటగాడి పట్ల అనుచితంగా ప్రవర్తిస్తూ సెండాఫ్ ఇవ్వగా.. అతనికి కోహ్లీ వత్తాసు పలికాడు. ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా ఇన్నింగ్స్ రెండో ఓవర్‌లోనే హర్షిత్ రాణా అద్భుతమైన బౌలింగ్‌తో రెండు వికెట్లు తీసాడు. ఈ పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన డెవాల్డ్ బ్రెవిస్ దూకుడుగా ఆడాడు. తనదైన బ్యాటింగ్‌తో సిక్సర్లు బాదాడు. ముఖ్యంగా హర్షిత్ రాణా బౌలింగ్‌లో అతను కొట్టిన నోలుక్ సిక్స్ ఈ మ్యాచ్‌కే హైలైట్‌గా మారింది. దాంతో అసహనానికి గురైన హర్షిత్ రాణా.. అతనికి కట్టుదిట్టంగా బౌలింగ్ చేశాడు. తాను వేసిన 22వ ఓవర్‌లో వరుసగా మూడు బంతులు డాట్ చేసాడు. ఒత్తిడికి గురైన డెవాల్డ్ బ్రెవిస్(37) నాలుగో బంతికి చెత్త షాట్‌తో రుతురాజ్ గైక్వాడ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దాంతో హర్షిత్ రాణా ఎగిరి గంతేసాడు. పెవిలియన్ వైపు నడుస్తున్న డెవాల్డ్ బ్రెవిస్‌పై నోరు పారేసుకున్నాడు. క్రీజు నుంచి వెళ్లాలని సైగలు చేస్తూ సెండాఫ్ ఇచ్చాడు. కోహ్లీ కూడా అతనికి వత్తాసు పలుకుతూ అతిగా సంబరాలు చేసుకున్నాడు. ఐసీసీ రూల్స్ ప్రకారం బ్యాటర్ ఔటైన తర్వాత అతిగా ప్రవర్తించడం నేరం. ఇప్పటికే ఐపీఎల్‌లో ఫ్లయింగ్ కిస్ సెలెబ్రేషన్స్‌తో హర్షిత్ రాణా ఓ మ్యాచ్‌లో నిషేధాన్ని ఎదుర్కొన్నాడు. అతని మ్యాచ్ ఫీజులో కోత విధించడం లేదా డీమెరిట్ పాయింట్స్ కేటాయించడం, మందలించడం వంటి చర్యలు తీసుకోవచ్చు. విరాట్ కోహ్లీని కూడా మ్యాచ్ రిఫరీ హెచ్చరించే అవకాశాలు ఉన్నాయి.

# టెన్నిస్ ప్లేయర్ కన్నుమూత



ప్రపంచ టెన్నిస్ రంగంలో చిరస్థాయిగా నిలిచిన ఇటలీ దిగ్గజ ఆటగాడు నికోలా పియట్రాంగెలీ (92) మంగళవారం కన్నుమూశారు. ఆయన మరణాన్ని ఇటలీ టెన్నిస్ ఫెడరేషన్ అధికారికంగా ప్రకటించింది. పియట్రాంగెలీ తన ప్రతిభతో టెన్నిస్ ప్రపంచంలో అజరామరమైన గుర్తింపు తెచ్చుకున్నారు.1933లో జన్మించిన నికోలా, స్వదేశం ఇటలీకి మాత్రమే కాకుండా యూరోపియన్ టెన్నిస్ చరిత్రకూ ప్రత్యేకమైన ముద్ర వేశారు. రష్యాకు చెందిన తల్లి, ఇటలీ తండ్రి దంపతులకు జన్మించిన ఆయన చిన్న వయస్సులోనే టెన్నిస్ నేర్చుకున్నారు. ఫ్రెంచ్ ఓపెన్‌ను రెండుసార్లు (1959, 1960) గెలుచుకున్న ఈ లెజెండ్, టెన్నిస్ ప్రియుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు. తన కెరీర్‌లో 44 సింగిల్స్ టైటిళ్లను సొంతం చేసుకున్న పియట్రాంగెలీ, డేవిస్ కప్‌లో కూడా ఇటలీకి అనేక విజయాలు అందించారు. ఆయన నాయకత్వంలో ఇటలీ జట్టు పలు సార్లు ఫైనల్స్ చేరింది. ప్రపంచ టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించుకున్న మొదటి ఇటలీ ఆటగాడు కావడం ఆయనకు ప్రత్యేక గౌరవం. పియట్రాంగెలీ మరణం ఇటలీ క్రీడాభిమానులకే కాకుండా ప్రపంచ టెన్నిస్ సమాజానికి అపూర్వ నష్టం. ఆయన పేరు టెన్నిస్ చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుంది.

# టీమిండియాకు రిలీఫ్..

## ఆ భయంకరమైన ప్లేయర్లు వచ్చేస్తున్నారు!

భారత జట్టుకు బిగ్ రిలీఫ్ దక్కింది. గాయాల కారణంగా భారత జట్టుకు దూరమైన వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్, డేంజర్ ప్లేయర్ హార్దిక్ పాండ్యా ఇద్దరు రీ-ఎంట్రీ ఇవ్వబోతున్నారట.ఈ ఇద్దరు స్టార్ ఆటగాళ్లు గాయాల నుంచి కోలుకున్నట్లు నేషనల్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. దక్షిణాఫ్రికాతో జరిగే టి20 సిరీస్ లో హార్దిక్ పాండ్యా ఆడేందుకు బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ క్లియరెన్స్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అటు శుభ్‌మన్ గిల్ కు కూడా ఇవాళ లేదా రేపు అనుమతి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే దక్షిణాఫ్రికాతో జరిగే టి20 సిరీస్ లో వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్, డేంజర్ ప్లేయర్ హార్దిక్ పాండ్యా ఇద్దరు స్టార్ ఆటగాళ్లు చోటు దక్కించుకునే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ ఇద్దరు తుది జట్టులోకి వస్తే, భారత జట్టుకు అడ్వాంటేజ్ ఉంటుంది. ఓపెనర్ సమస్యతో పాటు ఆల్ రౌండర్ సమస్య కూడా తొలగిపోనుంది. కాగా ఆసియా కప్ సందర్భంగా హార్ధిక్ పాండ్యా గాయం బారీన పడ్డాడు. అటు శుభ్‌మన్ గిల్ మెడ నొప్పితో బాధపడుతున్నాడు. ఇక శ్రేయాస్ అయ్యర్ గాయంపై ఇంకా క్లారిటీ రాలేదు. అతనికి మరికొన్ని రోజుల పాటు రెస్ట్ ఇవ్వబోతున్నారట. ఇది ఇలా ఉండగా భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా మధ్య మొత్తం ఐదు టీ 20లు జరగనున్నాయి. డిసెంబర్ 9వ తేదీన మొదటి టి20 కటక్ వేదికగా జరగనుంది. డిసెంబర్ 19వ తేదీ వరకు ఈ సిరీస్ కొనసాగుతుంది. టి20 వరల్డ్ కప్ కంటే ముందు, జరుగనున్న ఈ టీ20 సిరీస్ భారత జట్టుకు చాలా కీలకం కానుంది. ఇది ఇలా ఉండగా, కేఎల్ రాహుల్ సారథ్యంలోని భారత జట్టు అద్భుతంగా రాణిస్తోంది. దక్షిణాఫ్రికాపై జరిగిన తొలి వన్డేలో విజయం సాధించింది భారత్. ఈ తొలి వన్డేలో 19 పరుగుల తేడాతో గ్రాండ్ విక్టరీ కొట్టింది భారత్.

# కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్..

- బీఆర్ఎస్ పార్టీలో చేరిన నిజాంపేట కాంగ్రెస్ నాయకుడు వెల్దుర్తి శ్రీకాంత్ గౌడ్.
- గులాభి కండువా వేసి పార్టీలో ఆహ్వానించిన మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఏం పద్మ దేవేందర్ రెడ్డి.




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పల్లెపల్లెనా గులాభి జెండా రెపరెలాడుతుందని మెదక్ మాజీ ఎమ్మెల్యే. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు యం. పద్మదేవేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మెదక్ జిల్లా రామాయంపేట బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిజాంపేట మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు వెల్దుర్తి శ్రీకాంత్గౌడ్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. శ్రీకాంత్ గౌడ్ గులాభి కండువా వేసి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించిన పద్మదేవేందర్ రెడ్డి. అనంతరం పద్మదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం బీఆర్ఎస్ పార్టీలోనే పదేండ్ల కాలంలో రాష్ట్రం అభివృద్ధి దశలో ఉందన్నారు. పల్లె పల్లెనా అధినేత కేసీఆర్ నిధులతో అభివృద్ధి జరిగిందన్నారు. అభివృద్ధి అంటేనే బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ అని అన్నారు. కాంగ్రెస్. పార్టీ వచ్చి రెండున్నరేండ్లు కావస్తున్న ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా గ్రామీణ ప్రాంతాలకు అందలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయదుందుబి మోగిస్తుందన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఆరు గ్యారంటీల పేరిట ప్రజలను బురిడి కొట్టి అధికారంలోకి వచ్చిందన్నారు. ఆరు గ్యారంటీల్లో ఇప్పటికి ఒక్క గ్యారంటీ కూడా సరిగా అమ్మలు కాలేదన్నారు.కాంగ్రెస్ ను నమ్మి మరోసారి మోసపోవద్దని పేర్కొన్నారు. బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో నిజాంపేట్ పిఎసిఎస్ చైర్మన్ బాపురెడ్డి, నిజాంపేట్ పట్టణ పార్టీ అధ్యక్షులు చల్మెటి. నాగరాజు, మాజీ కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ అజిజ్, మాజీ సర్పంచ్ తిరుమల్ గౌడ్,నాయకులు రామ గౌడ్, రంజిత్ గౌడ్, మావురం. రాజు తదితరులు ఉన్నారు.

# తండగొండలో రోడ్డు ప్రమాదం

- యువకుడు చికిత్స పొందుతూ మృతి




**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, తండగొండ గ్రామ శివారు వద్ద 30.11.2025 రాత్రి సుమారు 11.30 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటనపై బోయినిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.వివరాల్లోకి వెళ్లగా : తండగొండ గ్రామానికి చెందిన ఎడపెల్లి అనురాగ్ (22) తన స్నేహితుడు పిట్టల అఖిల్ నడుపుతున్న పల్సర్ బైక్ (టీజీ 23%-%9249)పై బోయినిపల్లి నుంచి గంగాధర మెయిన్ రోడ్ మీదుగా తమ గ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో చేపూరి కనకయ్య వ్యవసాయ క్షేత్రం సమీపంలోని మలుపు వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ప్రమాదంలో అనురాగ్కు తీవ్ర గాయాలు కాగా, అఖిల్కు కూడా గాయాలయ్యాయి.ఘటన తర్వాత 108 అంబులెన్స్ ద్వారా అనురాగ్ను కరీంనగర్లోని అఖిరా హాస్పిటల్కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం 10.08 గంటలకు అనురాగ్ మృతి చెందాడు.మృతుడి తండ్రి ఎడపెల్లి రాజేశం ఫిర్యాదు మేరకు నిర్లక్ష్యంగా బైక్ నడిపి ప్రమాదానికి కారణమైన పిట్టల అఖిల్పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు బోయినిపల్లి ఎస్సై రమాకాంత్ తెలిపారు.

# నందయ్యకు డీసీసీ అధ్యక్ష నియామక పత్రాన్ని అందజేసిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

- హాజరైన సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే అజారుద్దీన్
- తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్



**జగిత్యాల(ప్రశ్న న్యూస్)** హైద్రాబాద్ గాంధీ భవన్ లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో మంగళవారం టిపిసిసి విస్తృతస్థాయి సమావేశం జరుగగా జగిత్యాల జిల్లా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య పాల్గొన్నారు. ఈ మేరకు జగిత్యాల డీసీసీ అధ్యక్షులుగా నియమితులైన గాజంగి నందయ్యకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నియామక పత్రాన్ని అందించారని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డిలు హాజరయ్యారు.ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు, సీ ఎం లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే విధంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల అధ్యక్షులు కృషి చేయాలని మండల, బ్లాక్ కాంగ్రెస్ కమిటీలు తొందర్లోనే పూర్తిస్థాయిలో నియమించాలని రాబోవు స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించే విధంగా డిసిసి అధ్యక్షులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

# ఉత్తరాంధ్రకు క్యూ కడుతున్న కంపెనీలు

- అధికారులకు కీలక ఆదేశాలు

అమరావతి (ప్రశ్న న్యూస్) ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు దృష్టి సారించారు. అందులో భాగంగా ఉత్తరాంధ్రలో మెటల్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గనుల శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎండీసీని ఆర్థికంగా మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లీజుకిచ్చిన గనులు కాకుండా వేరే చోట్ల ఎక్కడైనా అక్రమంగా తవ్వకాలు జరిగితే కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్రమ తవ్వకాలను ఆర్టీజీఎస్ వ్యవస్థ ద్వారా గుర్తించాలని డ్రోన్, శాటిలైట్ చిత్రాలను వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. గనుల ద్వారా అత్యధిక ఆదాయం పొందే రాష్ట్రాల్లో ఒడిశా ముందు ఉందన్న చంద్రబాబు ఒడిశాలో ఎలాంటి పద్ధతులను అనుసరిస్తున్నారో అధ్యయనం చేసి ఏపీలోనూ అమలు చేసే విషయాన్ని పరిశీలించాలని అన్నారు. వివిధ ఖనిజాల ముడి సరుకును విదేశాలకు ఎగుమతి చేయడం సహా ఆ ఖనిజాలకు అదనపు విలువను జోడించడం ద్వారా మరింత ఆదాయం వచ్చేలా చూడాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. విశాఖపట్నానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయన్న చంద్రబాబు.. విశాఖపట్నం బాగా అభివృద్ధి చెందబోతోందన్నారు. ఉత్తరాంధ్ర కేంద్రంగా మెటల్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని విశాఖలో ఏర్పాటయ్యే వివిధ పరిశ్రమల నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్ అక్కడి నుంచి సరఫరా అయ్యేలా చూడాలని అన్నారు. రాష్ట్రంలో లభించే ఖనిజాలు ఏయే ఉత్పత్తులకు ముడి సరుకుగా ఉపయోగపడతాయో అధ్యయనం చేయాలని ఆ మేరకు వాటిని ముడిసరుకు రూపంలో ఎగుమతులు చేయవచ్చని సూచించారు. మరోవైపు అమరావతి రాజధాని నిర్మాణ పనులకు మెటీరియల్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకూడదని చంద్రబాబు సూచించారు. అమరావతి రాజధాని నిర్మాణ పనులకు అవసరమైన ఇసుక, గ్రావెల్, మెటల్ వంటి వాటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. అమరావతిలో నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్ కృష్ణా జిల్లా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో లభ్యమవుతాయని సూచించారు. కలెక్టర్లతో మాట్లాడి సింగిల్ విండో విధానంలో ఆ మెటీరియల్ను సీఆర్డీఏకు పంపేలా చూడాలని చంద్రబాబు సూచించారు. ఈ విషయంలో ఎవరైనా ఇబ్బందులు పెట్టాలని చూస్తే చర్యలు తీసుకుంటామని సీఎం



చంద్రబాబు హెచ్చరించారు. ఇసుక సరఫరా విషయంలో ప్రజలలో సంతృప్త స్థాయి మరింత పెరగాల్సిన అవసరం ఉందన్న ముఖ్యమంత్రి సరిహద్దుల వద్ద చెక్ పోస్టులు, సీసీ కెమెరాల ద్వారా నిత్యం పర్యవేక్షణ ఉంచాలని సూచించారు.

# దేవుళ్లపైనే ఏకాభిప్రాయం లేనప్పుడు.. రాజకీయ నాయకులపై ఏముంటుంది?

- రేవంత్ వ్యాఖ్యలతో దుమారం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్లో జరిగిన టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వుళ్లపైనే ఏకాభిప్రాయం లేనప్పుడు, రాజకీయ నాయకులపై ఏముంటుందన చెప్పే క్రమంలో హిందువులకు ఎన్ని దేవతలు ఉన్నారు.? పెళ్లి కానోడికి హనుమంతుడు ఉన్నడు మందు తాగేటోళ్లకు ఇంకో దేవుడు అని ఒక్కొక్కరికి ఒక్కో దేవుడు ఉన్నాడు" అని వ్యాఖ్యానించారు. గాంధీభవన్లో జరిగిన కార్యక్రమంలో చేసిన ఈ వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. హిందువులు 3 కోట్ల దేవతలను నమ్ముతారని, అంతమంది దేవుళ్లు ఎందుకు ఉన్నారని వివిధ రకాల వ్యక్తులు, సమూహాలకు ప్రత్యేక దేవుళ్లు ఉన్నారని గా అన్నారు. "హిందువులు ఎన్ని దేవతలను నమ్ముతారు? మూడు కోట్లా? అంతమంది దేవుళ్లు ఎందుకు ఉన్నారు? పెళ్లి చేసుకోకుండా ఉండేవారికి హనుమంతుడు ఉన్నాడు. రెండు పెళ్లిళ్లు చేసుకునేవారికి మరొక దేవుడు ఉన్నాడు. మందు తాగేవారికి ఒక దేవుడు ఉన్నాడు. కోడి కోసేవారికి ఎల్లమ్మ, పోచమ్మ, మహిషమ్మ వంటి దేవతలు ఉన్నారు. పప్పన్నం తినేవారికి కూడా ఒక దేవుడు ఉన్నాడు. ప్రతి గ్రూపుకు తన సొంత దేవుడు ఉన్నాడు" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, హిందూ మత విశ్వాసాలను తేలికగా తీసుకున్నారని విమర్శలు వస్తున్నాయి. ఈ వ్యాఖ్యలు మతపరమైన భావాలను గాయ పరుస్తున్నాయని, బీజేపీ, బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా మండిపడుతూ, తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.



# పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పకపోతే సినిమాలు ఆడనివ్వం

- దిష్టి వ్యాఖ్యలపై పవన్ కల్యాణ్కు కోమటిరెడ్డి వెంకట్రెడ్డి వార్నింగ్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన "కోనసీమ దిష్టి" వ్యాఖ్యలు రాజకీయ దుమారాన్ని రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలపై తెలంగాణ నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారు. తాజాగా తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి పవన్పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పవన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేకపోతే తెలంగాణలో ఆయన సినిమాలను ఆడనివ్వబోమని హెచ్చరించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ "పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు నన్ను తీవ్రంగా బాధించాయి. తెలంగాణ ప్రజల దిష్టి వల్ల కాదు, గత ఆంధ్ర పాలకుల వల్లే ఇక్కడి ప్రజలు ఫ్లోరైడ్ నీళ్లు తాగారు. ఈ విషయం తెలుసుకోకుండా మాట్లాడటం సరికాదు. ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలి. లేదంటే, సినిమాటోగ్రఫీ మంత్రిగా చెబుతున్నా తెలంగాణలోని ఒక్క థియేటర్లో కూడా ఆయన సినిమా విడుదల కాదు" అని స్పష్టం చేశారు. అనంతరం పవన్ సోదరుడు చిరంజీవిని ప్రస్తావిస్తూ "చిరంజీవి ఒక సూపర్ స్టార్, ఆయన చాలా మంచి వ్యక్తి. కానీ, పవన్ కల్యాణ్కు రాజకీయ అనుభవం లేనట్లుంది. అందుకే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు" అని కోమటిరెడ్డి అభిప్రాయపడ్డారు. పవన్ వ్యాఖ్యలపై తెలంగాణలో వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో ఈ వివాదం మరింత ముదిరేలా కనిపిస్తోంది.



**- అసలు పవన్ ఏమన్నారంటే?**

ఇటీవల పవన్ గోదావరి జిల్లాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గోదావరి జిల్లాల పచ్చదనం వల్లే ఆంధ్రప్రదేశ్ విడిపోయిందని అన్నారు. తెలంగాణ నేతల దిష్టి తగలడం వల్లే గోదావరి జిల్లాల్లో కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై తెలంగాణ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు.

# జర్నలిస్టుల హక్కుల సాధనకై టీయూడబ్ల్యూజే ఉద్యమ ఘోష

- మహాధర్నా - కరపత్రాల ఆవిష్కరణ
- టీయుడబ్ల్యూజే రాజన్న సిరిసిల్ల జిల్లాధ్యక్షులు : దండి సంతోష్ కుమార్



వేములవాడ (ప్రశ్న న్యూస్) జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 3న హైదరాబాద్లో నిర్వహించనున్న టీయూడబ్ల్యూజే (తెలుగు వర్కింగ్ జర్నలిస్టుల సంఘం) మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను వేములవాడ పట్టణంలో మంగళవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్కుమార్, రాష్ట్ర లీగల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు రేగుల దేవేందర్, ప్రెస్క్లబ్ అధ్యక్షుడు పుట్టపాక లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నూగురి మహేష్, జిల్లా జాయింట్ సెక్రెటరీ రాపల్లి శ్రీనివాస్, ప్రెస్క్లబ్ జాయింట్ సెక్రెటరీ దూలం సంపత్, కార్యవర్గ సభ్యులు మ్యాన శ్రీనివాస్, ఉల్లెందుల మల్లేశం, సయ్యద్ పాషతో పాటు జర్నలిస్టులు గడిల ప్రవీణ్కుమార్, ఎం.ఏ. కలీం పాషా, గంప మహేష్, తోట అనిల్కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దండి సంతోష్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకూడదన్నారు. కొత్తగా అక్రెడిటేషన్ కార్డుల జారీ, ఆరోగ్య బీమా పథకం పునరుద్ధరణ, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరు, వృత్తి కమిటీ తక్షణ ఏర్పాటు వంటి కీలక డిమాండ్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు.డిసెంబర్ 3న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ మసాబ్ ట్యాంక్లోని రాష్ట్ర సమాచార కమిషనర్ కార్యాలయం ఎదుట జరిగే మహాధర్నాకు రాష్ట్ర, జాతీయ, జిల్లా, మండల స్థాయి నాయకులు సహా యూనియన్ సభ్యులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# మొబైల్ ఫోన్లలో సంచార్ సాథీ యాప్

- నిఘా కోసమేనని ప్రతిపక్షాల ఆరోపణ

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారతదేశంలో తయారైనదైనా లేక విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నదైనా సరే దేశంలోని ప్రతీ మొబైల్ ఫోన్ లోను సంచార్ సాథీ యాప్ ను తప్పనిసరిగా ఇన్ స్టాల్ చేయాలని కేంద్ర ప్రభుత్వం మొబైల్ కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. తొలగించడానికి వీలులేకుండా ఇన్ స్టాల్ చేయాలని సూచించింది. దీని కోసం ప్రభుత్వం 90 రోజులు గడువు కూడా విధించింది. మొబైల్ వినియోగదారులను సైబర్ మోసాల బారి నుంచి రక్షించడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. అయితే, కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్ తదితరులు ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. ప్రజలపై నిఘా పెట్టేందుకే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని, ఇది భారత రాజ్యాంగం కల్పించిన వ్యక్తిగత గోప్యత హక్కుకు భంగం కలిగిస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**- కేంద్రం వివరణ..**

ఇటీవలి కాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోయాయని, మోసగాళ్లు ఫిషింగ్ మెయిల్స్, మెసేజులు, ఏపీకే ఫైల్స్ పంపిస్తూ అమాయకుల బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. వాట్సాప్, మెసేజ్, ఫోన్ కాల్స్ ద్వారా మోసాలకు పాల్పడుతున్నారని వివరించాయి. స్పామ్ కాల్స్, మెసేజ్ లతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నాయి. ఈ మోసాలను అరికట్టేందుకే సంచార్ సాథీ యాప్ ను తీసుకువచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. మొబైల్ ఫోన్లలో డీఫాల్ట్ గా ఈ యాప్ ను ఇన్ స్టాల్ చేయడం ద్వారా సైబర్ నేరాలను కట్టడి చేసేందుకు వీలుకలుగుతుందని పేర్కొంది. ఇందుకోసమే సంచార్ సాథీ యాప్ ను ఇన్ స్టాల్ చేయాలని మొబైల్ కంపెనీలకు ఆదేశాలు జారీ చేసినట్లు వివరించింది. కాగా, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలపై మొబైల్ తయారీ కంపెనీలు ఇంకా స్పందించలేదు.

# భారత్ బలం పెరగడం వల్లే మోదీ మాటను వింటున్నారు

- ఆర్ఎస్ఎస్ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడినప్పుడు ప్రపంచ దేశాల నేతలు ఎంతో శ్రద్ధగా వింటున్నారని, దీనికి కారణం అంతర్జాతీయ వేదికపై భారత్ బలం, సత్తా ప్రదర్శితం కావడమేనని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. భారత్కు దక్కాల్సిన సరైన స్థానం ఇప్పుడు లభిస్తోందని, అందుకే ప్రపంచం మన దేశాన్ని గమనిస్తోందని ఆయన పేర్కొన్నారు. పూణెలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భగవత్ ప్రసంగించారు. భారత్ అభివృద్ధి పథంలో పయనిస్తే ప్రపంచ సమస్యలు పరిష్కారమవుతాయని, ఘర్షణలు తగ్గి శాంతి నెలకొంటుందని విశ్వాసం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితులు కూడా భారత్ నుంచి ఇదే ఆశిస్తున్నాయని ఆయన తెలిపారు.సంఘ్ స్థాపించి వందేళ్లు పూర్తయినప్పటికీ, సమాజాన్ని ఏకం చేసే పనిలో ఇంత జాప్యం ఎందుకు జరిగిందనే దానిపై ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని భగవత్ అన్నారు. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్, తొలితరం కార్యకర్తల త్యాగాల వల్లే సంఘ్ ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ఈ స్థాయికి చేరుకుందని గుర్తుచేశారు. తాము ఆలస్యంగా రాలేదని, తమ మాట వినడం మీరే ఆలస్యం చేశారని ఒక సందర్భంలో తాను చెప్పినట్లు భగవత్ గుర్తు చేసుకున్నారు. "వైవిధ్యంలో ఏకత్వమే మన పునాది. ధర్మం ఆధారంగా మనమందరం కలిసికట్టుగా ముందుకు సాగాలి" అని ఆయన పిలుపునిచ్చారు.

# విడుదలకు ముందే 'దృశ్యం 3' రికార్డులు..




మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న చిత్రం "దృశ్యం 3" విడుదల కాకముందే ఘనమైన వాణిజ్య విజయాన్ని అందుకుంది. జీతూ జోసెఫ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ మిస్టరీ థ్రిల్లర్ చిత్రానికి సంబంధించి వచ్చిన అప్‌డేట్ మలయాళ పరిశ్రమ మొత్తం దృష్టిని ఆకర్షిస్తోంది. సమాచారం ప్రకారం, ఈ ప్రాజెక్ట్ రూ.350 కోట్ల ప్రీ-బిజినెస్ సాధించి, ఇప్పటివరకు మలయాళ సినిమాకు దక్కని రికార్డును సృష్టించింది. జార్జ్‌కుట్టి పాత్రలో మోహన్‌లాల్ చూపించిన సహజ నటనతో 'దృశ్యం' కథ ప్రేక్షకుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచింది. మొదటి భాగం ఉత్కంఠను రేపితే, రెండో భాగం ఆ స్థాయిని మరింత పెంచింది. ఇప్పుడు మూడో భాగంపై ఆసక్తి తారస్థాయికి చేరింది. ఫ్రాంచైజీకి దక్కిన దేశవ్యాప్త గుర్తింపు కారణంగా ఈసారిగా మేకర్స్ రీమేక్ హక్కులను అమ్మకుండా, మలయాళం, తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ఒకేసారి విడుదల చేయాలని నిర్ణయించారు. 'దృశ్యం 3' భారీ బిజినెస్ జరగడానికి ప్రధాన కారణం మోహన్‌లాల్ స్టార్‌డమ్ మాత్రమే కాదు, జీతూ జోసెఫ్ రాసిన బలమైన కథా నిర్మాణం కూడా. వీరిద్దరి కాంబినేషన్‌కు ప్రేక్షకుల్లో ఉండే నమ్మకం ఈ విజయంలో కీలకం. దక్షిణ చిత్ర పరిశ్రమలో కూడా ఇప్పుడు ఈ సినిమా చర్చనీయాంశంగా మారింది. మలయాళ తెరపై రూ.100 కోట్ల మార్క్‌ని మొదట తెచ్చిన హీరో మోహన్‌లాల్ కావడం తెలిసిందే. 'పులిమురుగన్'తో అప్పుడే ఆయన క్రేజ్ మరోస్థాయికి వెళ్లింది. ఇప్పుడు మళ్లీ అదే మ్యాజిక్‌ను 'దృశ్యం 3'తో సృష్టించే అవకాశాలు కనిపిస్తున్నాయి. విశ్లేషకుల అంచనా ప్రకారం, ఈ చిత్రం విడుదలైన తర్వాత రూ.500 కోట్ల మార్క్ చేరడం ఆశ్చర్యకరం కాదని అంటున్నారు.

## 'ద్రౌపది 2' నుంచి మెలోడి సాంగ్ 'నా నెలరాజె'




రిచర్డ్ రిషి హీరోగా వస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'ద్రౌపది 2'. నేతాజీ ప్రొడక్షన్స్, జీఎం ఫిల్మ్ కార్పోరేషన్ బ్యానర్‌పై సోల చక్రవర్తి నిర్మిస్తున్న ఈ చిత్రానికి మోహన్.జి దర్శకులు. కాగా మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. త్వరలోనే అన్ని కార్యక్రమాల్ని పూర్తి చేసుకుని సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు. ద్రౌపది పాత్రలోని రక్షణ ఇందుచూడన్ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ రీసెంట్‌గానే విడుదల చేయగా సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ సినిమా నుంచి 'నెలరాజె..' పాటను మేకర్స్ విడుదల చేశారు. కాబోయే వరుడిని మనసులో ఊహించకుంటే పాడే ఈ పాటకు జిబ్రాన్ సంగీతం అందించగా.. సామ్రాట్ లిరిక్స్ అందించారు. పద్మలత ఆలపించారు. నట్టి నటరాజ్, వేల రామమూర్తి, చిరాగ్ జాని, దినేష్ లాంబా, గణేష్ గౌరంగ్, వై గీ మహేంద్రన్ తదితరులు ముఖ్యపాత్రల్లో కనిపించబోతున్నారు.

## సమంత రెండో పెళ్లి.. నాగచైతన్య షాకింగ్ పోస్ట్!



టాలీవుడ్ అగ్ర హీరోయిన్ సమంత రెండో పెళ్లి చేసుకున్నారు. నాగచైతన్యకు విడాకులు ఇచ్చిన తర్వాత దాదాపు 4 సంవత్సరాల పాటు సింగిల్ లైఫ్ లీడ్ చేసిన సమంత, సోమవారం రోజున రెండో పెళ్లి చేసుకొని అందరికీ షాక్ ఇచ్చారు. రాజ్ నిడిమోరుతో చాలా రోజులుగా లవ్ లో ఉన్న సమంత, అతనితోనే పెళ్లి పీటలెక్కింది. సమంత, రాజ్ నిడిమోరు వివాహం చాలా సీక్రెట్ గా, సన్నిహితుల మధ్య జరిగింది. ఇక సమంత రెండో పెళ్లి గురించి సోమవారం సోషల్ మీడియా మొత్తం వార్తలు అవుతున్న నేపథ్యంలో అక్కినేని నాగచైతన్య షాకింగ్ పోస్ట్ చేశారు.తన కెరీర్, సినిమా గురించి ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సృజనాత్మకమైన కథను ఎంచుకొని నిజాయితీగా నటిస్తే ప్రేక్షకులు ఖచ్చితంగా కనెక్ట్ అవుతారంటూ వ్యాఖ్యానించారు నాగచైతన్య. తాను నటించిన దూత సిరీస్ ఈ విషయాన్ని నిరూపించినట్లు తెలిపారు. దూత రిలీజ్ అయి రెండు సంవత్సరాలు అయిన సందర్భంగా ఈ పోస్ట్ పెట్టారు. ఈ ప్రాజెక్టులో నటించిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దీంతో నాగచైతన్య చేసిన ఈ పోస్ట్ వైరల్ గా మారింది. సమంత పెళ్లి రోజే, ఇలా రియాక్ట్ కావడం అవసరమా? అని కొంతమంది అంటుంటే, మరికొంతమంది దూత కోసం మాత్రమే నాగచైతన్య స్పందించాడని అంటున్నారు. దూత సీజన్ 2 ఎప్పుడంటూ మరి కొందరు రియాక్ట్ అవుతున్నారు. కాగా చైతూ కూడా శోభితాను రెండో వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే.

## మెగా ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్.. చిరంజీవి, వెంకటేశ్ స్పెషల్ డ్యాన్స్!



మెగాస్టార్ చిరంజీవి హీరోగా, దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'మన శంకర వర ప్రసాద్ గారు'. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా.. చిత్ర యూనిట్ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్‌ను అందించింది. ఈ చిత్రంలోని ఓ ప్రత్యేక గీతంలో మెగాస్టార్ చిరంజీవితో పాటు విక్టరీ వెంకటేశ్ కూడా కలిసి స్టెప్పులేస్తున్నారు. గచ్చిబౌలిలో వేసిన భారీ సెట్‌లో 500 మందికిపైగా డ్యాన్సర్లతో ఈ పాటను గ్రాండ్‌గా చిత్రీకరిస్తున్నారు. సినిమా చరిత్రలో చిరంజీవి, వెంకటేశ్ కలిసి డ్యాన్స్ చేయడం ఇదే తొలిసారి కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో అందించిన ఎలక్ట్రిఫైయింగ్ బీట్స్‌కు ఇద్దరు స్టార్లు తమ ఎనర్జీతో ప్రధాన ఆకర్షణగా నిలుస్తారని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రంలో వెంకటేశ్ ఓ కీలకమైన అతిథి పాత్రలో కనిపించనున్నారు. చిరంజీవి సరసన హీరోయిన్‌గా నయనతార నటిస్తోంది. 'సైరా నరసింహారెడ్డి', 'గాడ్‌ఫాదర్' తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న మూడో సినిమా ఇది. త్వరలోనే చిరంజీవి, నయనతారపై చిత్రీకరించిన ఒక రొమాంటిక్ పాటను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 2026 సంక్రాంతి కానుకగా సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## హాలీవుడ్‌లో నా ప్రయాణం ఇప్పుడే మొదలైంది



భారత చిత్ర పరిశ్రమ నుంచి హాలీవుడ్‌కు వెళ్లి గ్లోబల్ స్టార్‌గా ఎదిగిన నటి ప్రియాంక చోప్రా. తాజాగా తన కెరీర్ గురించి ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. బాలీవుడ్‌లో ఎన్నో విభిన్న పాత్రలు పోషించినప్పటికీ, అంతర్జాతీయ స్థాయిలో, ముఖ్యంగా ఇంగ్లీష్ సినిమాల్లో తన ప్రయాణం ఇప్పుడే మొదలైందని ఆమె అన్నారు. ఒక నటిగా తనలోని సృజనాత్మక దాహం ఇంకా తీరలేదని, చేయాల్సింది చాలా ఉందని స్పష్టం చేశారు. 2015లో అమెరికన్ టీవీ సిరీస్ 'క్వాంటికో'తో హాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన ప్రియాంక.. ఆ తర్వాత 'బేవాచ్', 'ది మ్యాట్రిక్స్ రీసరెక్షన్స్', 'సిటాడెల్' వంటి ప్రాజెక్టులతో అంతర్జాతీయ ప్రేక్షకులను మెప్పించారు. "ఒక కళాకారిణిగా హాలీవుడ్ సినిమాల్లో నేను ఇంకా ఎంతో చేయాల్సి ఉంది. నిజం చెప్పాలంటే, ఇప్పటివరకు నేను చేసింది చాలా తక్కువ," అని ఆమె ఒక అంతర్జాతీయ మీడియాకు సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. నటిగానే కాకుండా, నిర్మాతగా కూడా తనదైన ముద్ర వేయాలని ఆమె లక్ష్యంగా పెట్టుకున్నారు. సమాజంలో మార్పు తెచ్చే కథలను తెరకెక్కించాలనే ఉద్దేశంతో 2015లో 'పర్పుల్ పెబుల్ పిక్చర్స్' అనే నిర్మాణ సంస్థను స్థాపించినట్లు తెలిపారు. "నేను పరిశ్రమలోకి అడుగుపెట్టినప్పుడు నాకు మార్గనిర్దేశం చేసేవారు ఎవరూ లేరు. ఆ లోటును భర్తీ చేయాలనే ఉద్దేశంతోనే ఈ సంస్థను ప్రారంభించాను. నాకు దొరకని అవకాశాన్ని, అందను ఇతరులకు అందించడమే నా లక్ష్యం. 'పానీ', 'వెంటిలేటర్', 'టు కిల్ ఎ టైగర్' వంటి చిత్రాల ద్వారా మేం అదే ప్రయత్నం చేస్తున్నాం," అని ప్రియాంక చోప్రా తన మనసులోని మాటను పంచుకున్నారు. రెండు జాతీయ అవార్డులు అందుకున్న ఈ గ్లోబల్ ఐకాన్.. తన ప్రయాణాన్ని మరింత విస్తృతం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు.

## ఆషిక రంగనాథ్ ఇంట్లో తీవ్ర విషాదం



టాలీవుడ్ హీరోయిన ఆషిక రంగనాథ్ ఇంట్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆమె మేనమామ కూతురు అచల్ ఆత్మహత్య చేసుకుని నవంబర్ 22న మరణించగా.. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉద్యోగంలో చేరబోతున్న అచల్‌కు తన దూరపు బంధువైన మయాంక్‌తో పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారి పెళ్లి చేసుకుంటానని కూడా అచల్ డిసైడ్ అయింది. కానీ మయాంక్ మాత్రం తనను శారీరకంగా మానసికంగా వేధించేవాడని తెలుస్తోంది. మాదకద్రవ్యాలకు బానిసైన అతను పలువురు యువతులతో కూడా ఎఫైర్ పెట్టుకోగా.. అచల్‌ను లైంగికంగా వేధించడంతో పాటు పలుమార్లు చేయి చేసుకున్నాడట. ఇక అచల్‌కు మయాంక్ ఎఫైర్స్ తెలియడంతో తనను మోసం చేసినట్లు గ్రహించిన ఆమె ఎవరికీ చెప్పుకోలేక అతడిని మర్చిపోలేక తీవ్ర మనస్తాపానికి గురై సూసైడ్ చేసుకుంది. అచల్ తల్లిదండ్రులు మయాంక్‌తో పాటు అతని తల్లి మైనాపై కూడా పుట్టెనహళ్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. అయితే ఈ ఘటన జరిగి చాలా రోజులే అవుతున్నప్పటికీ పోలీసులు మాత్రం తగిన చర్యలు తీసుకోకపోవడం వల్ల కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ కుమార్తెకు న్యాయం చేయాలంటూ నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సంఘటనతో ఆషిక రంగనాథ్ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. కానీ ఈ విషయంపై మాత్రం ఆమె ఎక్కడా అధికారికంగా ప్రకటించకపోవడం గమనార్హం.

## సైకో థ్రిల్లర్ 'నయనం' స్ట్రీమింగ్ డేట్ ఫిక్స్



ప్రేక్షకులను వైవిధ్యమైన కంటెంట్‌తో మెప్పిస్తోన్న ఇండియాలో అతిపెద్దదైన ఓటీటీ ఫ్లాట్‌ఫామ్ జీ 5.. మరోసారి తెలుగు ఒరిజినల్ సిరీస్‌తో ఆడియన్స్‌ను అలరించనుంది. వరుణ్ సందేశ్ ఓటీటీ డెబ్యూ 'నయనం' డిసెంబర్ 19 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ సీట్ ఎడ్జ్ సైకో థ్రిల్లర్‌ను స్వాతి ప్రకాశ్ డైరెక్ట్ చేశారు. మనుషుల్లోని నిజ స్వభావానికి, ఏదో కావాలని తపించే తత్వానికి మధ్య ఉండే సున్నితమైన అంశాలను ఇందులో చూపించారు. ఈ సిరీస్ ఫస్ట్ లుక్ తాజాగా విడుదల కాగా ఆకట్టుకుంటోంది. ఆరు ఎపిసోడ్స్ కలిగిన జీ5 ఒరిజినల్.. నటుడిగా తన సరికొత్త ప్రయాణంగా మారిందన్నాడు వరుణ్ సందేశ్. ఇప్పటి వరకు చేయనటువంటి విభిన్నమైన పాత్రలో డాక్టర్ నయన్‌గా కనిపించబోతున్నానని... పోస్టర్‌ను గమనిస్తే తన పాత్రలో ఇంటెన్సిటీ అర్థమవుతుందన్నాడు. ఓటీటీలో యాక్ట్ చేయటం వల్ల ఇలాంటి పాత్రలో డెప్త్‌ను మరింతగా ఎలివేట్ చేసినట్లయ్యిందన్న వరుణ్.. ప్రేక్షకులు ఎలా ఆదరిస్తారో చూడాలని ఆసక్తిగా వెయిట్ చేస్తున్నానని చెప్పాడు.

## 'దేశం కోసం మనలో ఒక్కడు' ప్రారంభం



గోపీవర్మ దర్శకత్వంలో రాజశేఖర్ నిర్మాతగా హరివర్మన్ హీరోగా రాబోతున్న చిత్రం 'దేశం కోసం మనలో ఒక్కడు'. నటరాజన్ అండ్ కృష్ణమాల్ సమర్పణలో టి. గోపీవర్మ ఫిలిమ్స్ బ్యానర్ లో వస్తున్న ఈ చిత్రానికి సంబంధించి శుభ ముహూర్తం జరిగింది. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రముఖ నటుడు సత్య ప్రకాశ్ హాజరై క్లాప్ కొట్టగా.. ప్రముఖ కొరియో గ్రాఫర్ గణేష్ మాస్టర్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు.

గోపీవర్మ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్ర శుభ ముహూర్తంను పూజతో షూటింగ్ స్టార్ట్ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ గోపీవర్మ మాట్లాడుతూ.. నా మొదటి చిత్రం 'రాయలసీమ ప్రేమ కథ'. దర్శకత్వం వహిస్తున్న రెండవ చిత్రం 'దేశం కోసం మనలో ఒక్కడు' అని తెలిపారు. నిర్మాత రాజశేఖర్ గారికి ఎంతో రుణపడి వున్నానని.. ఎందుకంటే 'దేశం కోసం మనలో ఒక్కడు' చిత్రానికి సంబంధించి ప్రొడ్యూసర్స్ రావడం అంటే చాలా అరుదు. కానీ నన్ను నమ్మి ప్రొడ్యూసర్ ముందుకు వచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. తమిళ్ లో మొదటి సినిమా పూర్తి చేసిన హరి వర్మన్ హీరోగా తెలుగు సీమకు పరిచయం చేస్తున్నాను. అలాగే మొదటి సాంగ్ కొరియోగ్రాఫర్ గణేష్ మాస్టర్ గారు చాలా బాగా చేశారు. ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులకి నచ్చుతుంది. మరి కొద్ది రోజుల్లోనే ఈ చిత్రానికి సంబంధించి సెకండ్ షెడ్యూల్ స్టార్ట్ చేయబోతున్నామని చెప్పారు.

## పంచాయతీ ఎన్నికల నిర్వహణకు
# పకడ్బందీ చర్యలు

- పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల ర్యాండమైజెషన్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్.
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**మంథని ( ప్రశ్న న్యూస్)** పెద్దపెల్లి జిల్లా పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.సోమవారం జిల్లా కలెక్టర్ జిల్లా పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల ర్యాండమైజెషన్ ప్రక్రియను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాల వారిగా సిబ్బంది కేటాయింపు నిబంధనల ప్రకారం జరిగేలా చూడాలని అన్నారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ టి-యాప్ లో నమోదు చేయాలని అన్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి ప్రోక్యూర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ అందేలా చూడాలని అన్నారు. మండల కేంద్రాలకు అవసరమైన మేర బ్యాలెట్ బాక్సులు త్వరితగతిన పంపాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వివాదల మధ్య నిలిచిన
# వైన్స్ షాపు ఓపెనింగ్..

- గ్రూప్ అగ్రిమెంట్‌ను తిరస్కరించిన షాపు యజమాని..
- నిరసన తెలిపి షాపు ఓపెనింగ్‌ను అడ్డుకున్న గ్రూప్ సభ్యులు..




**మంథని( ప్రశ్న న్యూస్)** మంథని మండలంలోని గుంజపడుగు గ్రామంలో గల వైన్‌షాపు వివాదాల కారణంగా ప్రారంభోత్సవం నిలిచింది. ప్రభుత్వం నూతన మద్యం షాపులకు టెండర్లు పిలవడంతో సుమారుగా 38 మంది గ్రూపుగా కలసి వైన్ షాప్స్??కు టెండర్లు వేశారు. టెండర్లు వేసే క్రమంలో గ్రూప్ సభ్యులంత అగ్రిమెంట్ రాసుకున్నారు. ఎవ్వరికి పేరు పైన షాపు వచ్చిన అందరు కలసి షాప్‌ను నిర్వహించుకునే విధంగా అగ్రిమెంట్ రాసుకున్నారు. లక్కీ డ్రాలో గ్రూప్ సభ్యురాలైన భారతీకి డ్రాలో షాప్ వచ్చింది. ఈ క్రమంలో అందరు ముందుగా అనుకున్న దాని ప్రకారం నడవాల్సి ఉండగా షాప్ వచ్చిన మహిళ, కుటుంబ సభ్యులకు అట్టి అగ్రిమెంట్‌కు వ్యతిరేఖంగా వ్యవహరిస్తుండటంతో సోమవారం సభ్యులంతా షాపు ఎదుట నిరసనకు దిగి ఆందోళన చేశారు. ఈ క్రమంలో సంఘటన స్థలానికి చేరుకున్న మంథని ఎస్ఐ2 సాగర్, ఎక్సైజ్ ఎస్ఐ సాయికుమార్‌లు అందోళక కారులతో పాటు డ్రాలో షాప్‌ను దిక్కించుకున్న వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కానీ షాప్ యజమాని ఎంతకు అగ్రిమెంట్ ప్రకారం ముందుకు వెల్లకపోవడంతో అట్టి షాప్‌కు వచ్చిన లిక్కర్ మాల్‌ను బయటే వాహనంలో నిలిచి ఉంచారు. సమస్యను పరిష్కరించేంత వరకు షాప్ ఓపెనింగ్‌ను అడ్డుకుంటామని 37 మంది గ్రూప్ సభ్యులు తెలిపారు. చిన్న చిన్న పనులు చేసుకొని జీవించే తాము అంత తలోకొంత డబ్బులు వేసుకొని వైన్ షాప్‌లకు టెండర్లు వేస్తే తీరా డ్రాలో వచ్చిన తరువాత అగ్రిమెంట్ ప్రకారం కాకుండా తనకు ఇష్టం వచ్చినట్లు చేస్తుండటంతో సభ్యులంతా తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. తమకు న్యాయం చేసే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుక కూర్చున్నారు.ఇక్కడ గ్రూప్ సభ్యులు బత్తిని శ్రీనివాస్, నర్సింహారెడ్డి, మల్లేష్, సురేందర్ రెడ్డి, కుర శ్రీనివాస్,శ్రీనివాలతో పాటు పెద్ద ఎత్తున సభ్యులు ఉన్నారు.

## సర్పంచ్ ఎన్నికల్లో ప్రజల సహకారం అవసరం

- స్వేచ్ఛాయుత ఎన్నికలే పోలీసుల ప్రధాన లక్ష్యం
- బోయినిపల్లి ఎస్సై : రమాకాంత్




**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం దేశాయిపల్లి,వర్ధవెలి గ్రామాల్లో జరగనున్న గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని ఎస్సై రమాకాంత్ అన్నారు. గ్రామాల్లో ఎన్నికలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ మంగళవారం ఆయన పలు సూచనలు చేశారు.స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు జరగాలంటే ప్రతి ఓటరు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల సమయంలో చట్టాన్ని గౌరవిస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడకూడదని హెచ్చరించారు. రాజకీయ కారణాలతో వివాదాలు, గుంపుల ఘర్షణలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.డబ్బు, మద్యం, బహుమతుల పంపిణీ లేదా స్వీకరణ నేరమని తెలిపారు. అక్రమ ప్రయోజనాల కోసం ఇలాంటి పనుల్లో పాల్గొన్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల ద్వారా తప్పుడు ప్రచారం, పుకార్లు వ్యాప్తి చేయడం శాంతి భద్రతలకు ముప్పుగా మారుతుందని హెచ్చరించారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా పాటించాలని, ఎలాంటి అనుమానాస్పద కదలికలు, బెదిరింపులు, అక్రమ రవాణా లేదా బహుమతుల పంపిణీ కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎన్నికలు ప్రశాంతంగా, న్యాయంగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్సై రమాకాంత్ తెలిపారు.

# అక్రమ నిర్మాణాలు చేస్తే కూల్చివేస్తాం: ఏసిపి పావని

- అక్రమ నిర్మాణాలను సహించే ప్రసక్తే లేదు
- రాజకీయ వత్తిళ్లకు తలొగ్గేది లేదు
- అధికారుల పేరు చెప్పి ఎవరైన అక్రమ నిర్మాణాలు చేస్తే కేసులు పెడతాం
- అక్రమ నిర్మాణాలను బిల్డర్లు, ప్రజలు మానుకోవాలి లేకుంటే చర్యలు తప్పవు
- అక్రమ నిర్మాణాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరుగుతుంది







**సీతాఫలమండి (ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేస్తే కూల్చివేత్తలు తప్పవని ఏసీపి పావని హెచ్చరించారు. ఇటీవల కొంతమంది బిల్డర్లు, స్థానికులు రాజకీయ నాయకుల పేరుతో అక్రమ నిర్మాణాలు చేసుకొని అధికారుల పేర్లు విచ్చలవిడిగా ఉపయోగించుకోవడం జరుగుతుందని కానీ సికింద్రాబాద్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ భాగంలో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించే ప్రసక్తే లేదన్నారు. అనుమతుల ప్రకారం నిర్మాణాలు చేస్తే చర్యలు తీసుకోమని అందుకు విరుద్ధంగా ఎవరు చేసిన చర్యలు తప్పవన్నారు. కోర్టు ఆర్డర్ తీసుకొని అక్రమ నిర్మాణాలు చేసే వారిపై కౌంటర్ వేసి కోర్టు స్టే తొలగించి కూల్చివేతలు చేస్తామని హెచ్చరించారు. కొంతమంది అధికారుల పేరు చెప్పి వసూలుదందా ప్రారంభించారని తమ దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో అధికారులు కానీ సిబ్బంది కానీ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించడం లేదని ఎవరైనా ప్రోత్సహించినట్టు ఆధారాలతోని వస్తే వాళ్లపై చర్యలు తీసుకుంటామని ఏది అయిన జిహెచ్ఎంసి రూల్స్ ప్రకారమే జరగాలన్నారు. ఎలాంటి డివియేషన్స్ ఉండవద్దని అదేవిధంగా అక్రమ అంతస్తులు, అక్రమ సెల్లార్లు తీసే వారిపై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### అక్రమ నిర్మాణం కూల్చివేత..

చిలకలగూడలో 11%-1-%333 అనుమతులకు విరుద్ధంగా అక్రమ నిర్మాణం చేయడంతో స్థానికులు ఫిర్యాదు చేసిన వెంటనే స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీం అక్రమ నిర్మాణాన్ని పూర్తిగా కూల్చివేశారు. అయితే ఈ అక్రమ నిర్మాణాన్ని తిరిగి నిర్మాణ పనులు చేస్తే స్థానిక పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేస్తామని అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరిస్తామని ఏసిపి పావని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ నర్సింగ్ రావు, న్యాక్ ఇంజనీర్లు, చైన్ మెన్ లు తదితరులు పాల్గొన్నారు.

## ప్పిపోయిన 10 ఏళ్ల బాలికను సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించిన బ్లూ కోర్ట్ సిబ్బంది



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** జనగాం జిల్లాకు చెందిన 10 సంవత్సరాల బాలిక గట్టు స్నేహిత (తండ్రి: శ్రీకాంత్, నివాసం: ఉప్పుగళ్ల, జాఫర్‌గఢ్ మండలం, జనగాం జిల్లా) అనూహ్యంగా తప్పిపోయింది. ఈ విషయం సంబంధిత అధికారుల దృష్టికి వెళ్లగానే బ్లూ కోర్ట్ సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు.తక్షణ చర్యల్లో భాగంగా బాలికను గుర్తించిన బ్లూ కోర్ట్ సిబ్బంది, ఆమెను పూర్తి భద్రతతో సంరక్షిస్తూ విచారణ నిర్వహించారు. అనంతరం బాలిక తల్లిదండ్రులు శ్రీకాంత్‌ను సంప్రదించి,అన్ని నిర్ధారణల తరువాత గట్టు స్నేహితను సురక్షితంగా వారికి అప్పగించారు.బ్లూ కోర్ట్ సిబ్బంది వేగవంతమైన స్పందన,మానవతా దృక్పథం వల్ల పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు ప్రశంసించారు.ఈ ఘటనలో తల్లిదండ్రులు అధికారులకు,బ్లూ కోర్ట్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## నామినేషన్ కేంద్రం - ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

- ఇంచార్జి జిల్లా కలెక్టర్ : గరిమా అగ్రవాల్



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** గ్రామ పంచాయతీ ఎన్నికల రెండో విడత నామినేషన్ ప్రక్రియలో భాగంగా బోయినిపల్లి నామినేషన్ కేంద్రాన్ని ఇంచార్జి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమా అగ్రవాల్ మంగళవారం తనిఖీ చేశారు. బోయినిపల్లి ఆర్ఓ కేంద్రంలో నామినేషన్ల స్వీకరణ తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.నామినేషన్ దాఖలు చేసే ప్రతి అభ్యర్థికి తప్పనిసరిగా నూతన బ్యాంక్ ఖాతా ఉండాలని, అన్ని వివరాలను పూర్తి స్థాయిలో పూరించాలని ఇంచార్జి కలెక్టర్ స్పష్టం చేశారు. అభ్యర్థుల తుది జాబితా ప్రకటించిన అనంతరం ఎన్నికల నియమావళి, వ్యయ వివరాలపై అభ్యర్థులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించిన ఆమె, అధికారులు%-%సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. అలాగే బోయినిపల్లి జడ్పీ హై స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని తనిఖీ చేసి, అవసరమైన ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీఓకు సూచించారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రంలో తనిఖీ

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అవసరమైన మేర లారీలు సిద్ధంగా ఉంచాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిని ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. బోయినిపల్లి మండల కేంద్రంలోని ఏఎంసీ ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం తేమ శాతం, తూకం విధానాలను పరిశీలించారు.రైతులకు అవసరమైన టార్పాలిన్, తాగునీరు తదితర వసతులు కల్పించాలని సూచించిన ఇంచార్జి కలెక్టర్, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే సమీప రైస్ మిల్లులకు తరలించాలని, ట్యాబ్ ఎంట్రీలు వేగంగా పూర్తిచేసి రైతుల ఖాతాల్లో డబ్బులు త్వరగా జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం నిల్వల పరిమాణానికి అనుగుణంగా లారీలు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ రాధాభాయి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చంద్రప్రకాశ్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం,బోయినిపల్లి తహసీల్దార్ నారాయణ రెడ్డి, ఎంపీడీఓ జయశీల తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి వరకు సిలబస్ పూర్తి చేయాలి


- ప్రణాళికాబద్ధంగా చదివి భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరాలి
- ఇంచార్జి జిల్లా కలెక్టర్ : గరిమా అగ్రవాల్
- బోయినిపల్లి మోడల్ స్కూల్ ఆకస్మిక తనిఖీ



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదువుపై దృష్టి పెట్టి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్ అన్నారు. బోయినిపల్లి మోడల్ స్కూల్‌లో మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు,సిబ్బంది హాజరు రికార్డులు, స్కూల్ ఆవరణ పరిశుభ్రత, మధ్యాహ్న భోజన పథకం అమలు, ఆహార తయారీ విధానాన్ని ఆమె పరిశీలించారు. మెనూ ప్రకారం రోజు అంది స్తున్న భోజనంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన ఆహారం తప్పనిసరిగా విద్యార్థులకు అందించాలని నిర్వాహకులను ఆదేశించారు.7వ తరగతి ఇంగ్లీష్ పీరియడ్‌ను పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్, విద్యార్థులతో స్వయంగా మాట్లాడి ప్రశ్నలు వేయడం ద్వారా వారి అవగాహన స్థాయిని తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రతిరోజూ పాఠశాలకు హాజరు కావాలని సూచించారు. ఫిబ్రవరి నాటికి సిలబస్ పూర్తిచేసి, వార్షిక పరీక్షలకు సక్రమంగా సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు అన్ని విషయాల్లో పట్టు సాధించడంతో పాటు ఇంగ్లీష్‌లో ధైర్యంగా మాట్లాడే స్థాయికి ఎదగాలని కోరారు.

## నేటి నుండి మూడవ విడత నామినేషన్ ప్రక్రియ

- నర్సాపూర్, చిలిపిచేడ్, కౌడిపల్లి, కొల్చారం, శివంపేట్, వెల్దుర్తి, మాసాయిపేట్, మండలాల్లో నామినేషన్ స్వీకరణ కి ఏర్పాట్లు పూర్తి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్)** సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరిగే మూడవ విడత నామినేషన్ స్వీకరణ ప్రక్రియకి పూర్తి ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. రేపటినుండి జరగబోవు మూడో విడత నామినేషన్ ప్రక్రియ లో భాగంగా కొల్చారం ఎంపీడీవో కార్యాలయాన్ని కలెక్టర్ మంగళవారం సందర్శించారు.ఈ నెల 3వ తేదీ నుండి 5వ తేదీ వరకు..07 మండలాలకు సంబంధించిన 183 గ్రామపంచాయతీలు, 1528 వార్డులకు జరిగే మూడవ విడత నామినేషన్ ప్రక్రియ కి సంబందించి అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధం గా ఉన్నారన్నారు5 గంటలకు నామినేషన్ కేంద్రం గేటు మూసివేయాలని,నామినేషన్ కేంద్రంలో ఉన్న అభ్యర్థుల నుండి మాత్రమే నామినేషన్లు స్వీకరించాలని,ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి ప్రక్రియ ను త్వరగా పూర్తి చేసేలా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఎన్నికల నిర్వహణ లో అలసత్వం వహించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ స్వీకరణ కేంద్రం ముందు గ్రామపంచాయతీలోని వార్డుల వారీగా ఫోటో ఓటర్ల జాబితా, రిజర్వేషన్ల వివరాలను ప్రదర్శించాలని, నామినేషన్ కేంద్రం నుండి 100 మీటర్ల పరిధిలో గుంపులుగా ఎవరిని అనుమతించరని.. నామినేషన్ సమర్పించే అభ్యర్థులు, ప్రతిపాదించే వారికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారునామినేషన్ల స్వీకరణలో ఎన్నికల సంఘం జారీ చేసిన నియమాలకు లోబడి వ్యవహరించాలని, నామినేషన్ పత్రాల స్వీకరణ, నామినేషన్ల పరిశీలన, అభ్యర్థుల ప్రకటన, గుర్తుల కేటాయింపు ప్రక్రియలో జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులకు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి, తాసిల్దార్ శ్రీనివాసాచారి, ఎంపీడీవో , రిటర్నింగ్ అధికారులు రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మంగళవారం “మంగళమే”,
# ఆందళనలో “పెట్టుబడిదారులు”.?




- బోయిన్ పల్లి మార్కెట్లో బుధవారం ఉదయం 7 గంటలకు ఏం జరుగుతుందో.?
- "డిసి" సీక్రెట్స్ లీక్ చేస్తుంది ఎవరు.? మార్కెట్లో ఒక్కడు మాస్క్ తో మాయ చేస్తున్నాడా.?
- మలుపులు ఎవరి సొంతం అయ్యాయి,ఎవరిది ఎంత వాటా,సహకరించింది ఎవరు.?
- అధికారులు వర్సెస్ కమీషన్ దార్లు,చట్టాన్ని ఫాలో అవుతాం,వాస్తవాన్ని చూడండి.
- ఐక్యతతోనే మహేందర్ రెడ్డికి న్యాయం జరుగుతుందని సోమ ఆశా భావం.?
- భయం గుప్పిట్లో కొన్నవాళ్లు, ఎప్పటికైనా మాదే అంటున్న లైసెన్స్ దారులు.?
- అందరి బాధ ఒక్కటే,దరి చేర్చే వారేవరు.?
- పాలకమండలి,అధికారులు వాస్తవాలు వైపు అడుగులు వేస్తే మార్కెట్ ఖాళీ యేనా.?
- నిజం తెలియక కొనుగోలు, ఇప్పుడు లబోదిబోమంటున్నారు.
- జి.శ్రీనివాస్ గౌడ్ లైసెన్స్ దారున్ని"తక్ పట్టి" ఎక్కడా.?
- ఆరు మందికి కిరాయి ఇచ్చింది ఎవరు, నెలకు “3”లక్షలు, అడ్వాన్స్ “6”లక్షలు వసూలు చేసింది ఎవరు.?
- లక్షలు పోసి కొనుగోలు,లక్ష్యం చేరని ఆలోచనలు, ఆత్మహత్యలకు ఎదురు చూపులు.?




కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో బుధవారం ఉదయం 7: గంటలకు ఏం జరుగుతుందో చూడాల్సిందే! బోయిన్ పల్లి మార్కెట్ లో మాయగాళ్లు ఉన్నారు జాగ్రత్త.డబ్బులకు పని చేసే వాళ్ళు కొందరు అయితే,మరి కొందరు లోసుగులు చెప్పి పలువురికి సహకరిస్తున్నారు.వీళ్లను కనిపెట్టడం చాలా కష్టంతో కూడుకున్న వ్యవహారం. ఎందుకంటే మనతోనే ఉంటారు,మనకే గోతులు తవ్వుతారు.నిత్యం నలుగురులో ఉంటారు,గంట గడవక ముందే ముగ్గురికి జోబుకి చిల్లు పెడుతారు. ఇలాంటి వాళ్లని ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మకూడదు అంటున్నారు అనుభవం ఉన్న మార్కెట్ వర్గాలు.బోయిన్ పల్లి మార్కెట్ లో మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు జారీ చేసిన “175”దుకాణాలు. 1932 చట్టం ప్రకారం పార్టనర్ షిప్ డిడ్ ద్వారా ఫారం పేరు మార్చకుండా,వర్తకుల పేర్లు మార్చుకోవచ్చు అనే వెసులుబాటు కల్పించింది చట్టం.విషయం తెలియక కొంతమంది అదే దారిలో ప్రయాణిస్తున్నారు. నడుస్తున్న తవ్వలో సమస్యలు తలెత్తుతే శావే శరణం అంటున్నారు. కానీ అసలు గుట్టు ఎంటో తెలుసా బోయిన్ పల్లి మార్కెట్ లో నూటికి ఎనభై శాతం షాపులు ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోయాయి, ఇదే వాస్తవం. నిజానికి వ్యవసాయ మార్కెటింగ్ చట్టం ప్రకారం 1966.లైసెన్స్ దారులు అనివార్య కారణాల వల్ల వ్యాపారం చేయలేకపోతే వారసులకు అప్పగించాలి, అంతే గానీ విక్రయించడం నేరం.ఒక వేళ అతనికి ఆర్థిక ఇబ్బందులు ఉంటే వ్యవసాయ మార్కెటింగ్ శాఖకు లేఖ ద్వారా తన సమస్యను వివరించాలి. అప్పుడు అధికారులు సదరు కమీషన్ దారుని లైసెన్స్ రద్దు చేసి ఓపెన్ యాక్షన్ లో వేలం పాట ద్వారా వచ్చిన రుసుము అతనికి అందజేస్తారు.ఇది లైసెన్స్ ను మార్చే ప్రక్రియ. ఇలాంటి విధానానికి నీళ్ళు వదిలి. బహిరంగ మార్కెట్లో కోట్లల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వీటిని కమిటిలు, అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం వల్ల కూడా పలు సమస్యలు ఎదురవుతున్నాయి. ఇదిలా ఉంటే గత ఆరు నెలలుగా బోయిన్ పల్లి మార్కెట్ లో పలు సమస్యలు తాండవిస్తున్నాయి. వీటిని పక్కకు పెట్టి కొత్త ఇబ్బందులకు తెర లేపారు కొందరు. సగటున రోజుకు సుమారు ఇరవై ఐదు వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్ అయిన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ కి నిత్యం ఇరవై ఏడు వేల టన్నుల కూరగాయలు వివిధ రకాల రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నాయని మార్కెట్ అధికారులు చెబుతున్నారు.ఇంత పెద్ద పేరు మోసిన మార్కెట్లో అంతర్గత సమస్యలు చాంతాడంత నాలుక చాపి స్వాగతం పలుకుతున్నాయి. దీన్ని పట్టించుకోవాల్సిన అధికారులు నిమ్మకు నిరెత్తన్నట్లు వ్యవహారించడం అందరు తప్పు పడుతున్నారు.ఇటు అధికారులను వివరణ అడిగితే ఉన్నత అధికారులకు స్థానిక విషయాలు ఎప్పటికప్పుడు తెలియజేశామని చేతులు దులుపుకుంటున్నారు. కమిటి అధికారులు, సంబంధింత మంత్రుల చూట్టూ ప్రదర్శనలు చేస్తున్న ఇసుకంత పని కూడా ముందుకు పొతలే! పదకొండు నెలల పూర్తి చేసుకుంటున్నప్పటికి చెప్పుకో దగ్గ అంశం




ఏమి లేదు.?ఇక మార్కెట్ భవిష్యత్తు స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ పైనే ఉందని పలువురు నుంచి గుసగుసలు వినిపిస్తున్న నేపథ్యంలో మార్కెట్ పెద్దలు ఎమ్మెల్యే శ్రీ గణేష్ ని ఈమధ్య కలుస్తే మీ సమస్య మార్కెట్ కమిటీ చైర్మన్,సెక్రటరీ పరిష్కరిస్తారని చెప్పినట్లు సమాచారం.?

### - బుధవారం ఏం జరుగుతుందో..

సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు బుధవారం ఉదయం 7: గంటలకు కమీషన్ ఏజెంట్లు ఐక్యతతో మహేందర్ రెడ్డి కుటుంబానికీ బాసటగా ఉండాలని పిలుపునిచ్చారు అధ్యక్షుడు సోమ దేవేందర్ రెడ్డి.విశ్వసనీయ సమాచారం మేరకు బోయిన్ పల్లి మార్కెట్ లో నిన్న జి.శ్రీనివాస్ గౌడ్ వద్ద కిరాయికి తీసుకున్న వ్యక్తులకు (స్వీట్ కాన్: శ్రీను, ఆలుగడ్డ:శ్రీనివాస్,సాంబ: బీన్స్, బెంగుళూరు మాల్,ముత్తూ కుమార్: చిక్కుడు కాయలు సోలాపూర్, పిఎస్కే మల్లేష్: చిల్లర అయిటమ్స్) బుధవారం నుంచి వ్యాపారాలు ఆపేయాలి అంటూ మార్కెట్ వర్గాలు తెలిపారు. కిరాయి దార్లు మాత్రం మాకేమీ శ్రీనివాస్ గౌడ్ నుంచి ఎటువంటి సమాచారం లేదు మేము ససేమిరా ఖాళీ చేయమని భీష్మించుకున్నారు. ఇదిలా ఉంటే మార్కెట్ అసోసియేషన్ పెద్దలు బుధవారం ఉదయం 7 గంటలకు అదే స్థలంలో మహేందర్ రెడ్డి కుటుంబ సభ్యులతో వ్యాపారం చేయించాలని తీర్మానం చేసుకున్నట్లు సమాచారం. ఆరు మందికి కిరాయి ఇస్తూ, లక్షల రూపాయలు జేబులో వేసుకుంటుంది ఎవరు ? అసలు ఈ “శ్రీనివాసుని లీలలు”ఎన్ని రోజులు.ఈ లీలలు వెనుక రారాజులు ఎవరున్నారు.వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని మార్కెట్ వర్గాలు అంటున్నారు.ఇప్పటికైనా మహేందర్ రెడ్డి సమస్యకు తెర పడుతుందా లేక(టీవీ సిరియల్స్ ) ధారావాహికలు వలే రోజు రోజుకు టెన్షన్ పెడుతుందా చూడాల్సిందే.

# అనుమతులకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు

- కమర్షియల్, రెసిడెన్షియల్ నిర్మాణాలు అన్ని అక్రమాలే
- మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్న లెక్కచేయకుండా పనులు చేస్తున్న అక్రమ నిర్మాణదారులు
- రాజకీయ నాయకులు అక్రమ నిర్మాణదారులకు వత్తాసు పలకడం వెనుక మతలభేమిటి
- టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేసిన సీజింగ్ బోర్డును తొలగించి పనులను చేపడుతున్న అక్రమ నిర్మాణదారులు
- అక్రమ నిర్మాణం చేపడితే టౌన్ ప్లానింగ్ అధికారులు వాటిపై చర్యలు తీసుకోరా
- జిహెచ్ఎంసి ఆదాయానికి గండి కొడుతున్న కార్పొరేటర్ల మౌనం ఎందుకు
- అక్రమాల నిర్మాణదారులకు వత్తాసు పలుకుతున్న షాడో కార్పొరేటర్లు
- కార్పొరేటర్ల కండ్ల ముందు అక్రమ నిర్మాణం కనబడుతున్న వాటిపై ఫిర్యాదు చేయరా


బేగంపేట సర్కిల్ హైదర్ బస్తీలో భారీ అక్రమ నిర్మాణం


రామంతపూర్ డివిజన్ ఆర్టీసీ కాలనీలో అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం అవుతున్న నిర్మాణం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాదులో భారీగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు రాజకీయ నాయకులు అక్రమ నిర్మాణ దారులకు వత్తాసు పలుకుతూ వాళ్లతో కుమ్మక్కయ్యారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై స్థానిక ప్రజలు టౌన్ ప్లానింగ్ అధికారులకు, జోనల్ కమిషనర్ కు ఫిర్యాదు చేసిన నోటీసులు ఇచ్చి కాలయాపన చేస్తున్నారని అక్రమ నిర్మాణాల పై అధికారులు చర్యలు తీసుకోకపోవణడం వెనుక భారీగా లంచాలు తీసుకోవడం రాజకీయ నాయకుల హస్తం ఉన్నదని అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలకడం వెనుక మతల భేమిటని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### 24 గంటలు గడపకు ముందే సీజ్ బోర్డు తొలగింపు

సికింద్రాబాద్, ఉప్పల్, సనత్ నగర్, ముషీరాబాద్, నియోజకవర్గం లో సీజింగ్ చేసిన బిల్డింగ్ లో యదేచ్చగ నిర్మాణాలు చేపడుతున్నారని తూతూ మంత్రంగా సీజింగ్ బోర్డులు పెట్టి నోటీసులు ఇచ్చి టౌన్ ప్లానింగ్ అధికారులు చేతులు దులుపుకుంటున్నారని సీజింగ్ చేసిన 24 గంటల్లోనే సీజింగ్ బోర్డులను తొలగించి నిర్మాణాలు చేపడుతున్నారు. అనుమతులకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న ఆయారామ్ గయారామ్ అన్నట్టు టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ నిర్మాణం వద్దకు వచ్చి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొని పోతున్నారే తప్ప వాటి పై చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని చర్యలు


హబ్సిగూడ డివిజన్ వెంకట్ రెడ్డి నగర్ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం


ముషీరాబాద్ దయారా మార్కెట్ వద్ద సీజ్ చేసిన భవనం లో జరుగుతున్న నిర్మాణ పనులు


రామంతపూర్ డివిజన్ వాసవి నగర్ లో నిర్మాణం

తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారంటే ఎంత భారీ స్థాయిలో లంచాలు తీసుకుని అవినీతికి పాల్పడుతున్నారు అని ప్రజలు విమర్శలు కురిపిస్తున్నారు.

### ఉప్పల్ సర్కిల్ పరిధిలో..

ఉప్పల్ మున్సిపల్ సర్కిల్లో నాలుగు డివిజన్లో రాజకీయ నాయకుల కనుసైగల్లో భారీ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని వాటిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు టౌన్ ప్లానింగ్ అధికారులకు ఎన్ని ఫిర్యాదు చేసిన కేవలం టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు ఇస్తున్నారే తప్ప వాటి పై చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని, అలా కాదంటే సీజింగ్ బోర్డులను ఏర్పాటు చేసి ఆ బిల్డింగ్ సీజింగ్ చేసాము అని చెప్పుకుంటున్నారు. సీజింగ్ చేసిన తర్వాత పనులు నిర్వహిస్తున్న ఆ పనులను ఎందుకని టౌన్ ప్లానింగ్ అధికారులు ఆపకుండా కాలయాపన చేస్తున్నారని సీజ్ పేరుతో భారీగా లంచాలు తీసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సీజింగ్ బోర్డులను తొలగించిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టకుండా కాలయాపన చేయడం వెనుక ఆర్థిక లావాదేవీలే కారణమని స్థానికులు గుసగుసలాడుతున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు సీజింగ్ చేసిన బోర్డును సైతం అక్రమార్కులు తొలగించి పనులను నిర్వహిస్తున్నారు అంటే ఆ నిర్మాణదారుడు కి రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయా.? రాజకీయ నాయకులు అండదండలు ఉన్నప్పుడు ప్రభుత్వ జీవోలు ఎందుకు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం ఎందుకు నోటీసులు ఇవ్వడం ఎందుకు సీజింగ్ చేయడం ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### సికింద్రాబాద్, మల్కాజ్గిరి, బేగంపేట, ముషీరాబాద్ కాప్రా సర్కిల్లో..

అక్రమ నిర్మాణాలకు ఈ సర్కిళ్లు పుట్టినిల్లుగా మార్చేశారు అవినీతి అధికారులు. మల్కాజిగిరి ఏసీపి బాల శ్రీనివాస్ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించడం కిల్లి వేసుకున్నంత సులువుగా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దానికి తోడు సికింద్రాబాద్, బేగంపేట, ముషీరాబాద్, కాప్రా సర్కిలలో సైతం అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక కాప్రా సర్కిల్ పరిధిలో ఏసీపీ కృష్ణ మోహన్ స్టైలే వేరు అక్రమ నిర్మాణాలను చేయించడంలో ఆయన మించిన అధికారులు లేరన్న విమర్శలు ఉన్నాయి. గతంలో కూడా ఆయన అవినీతిలో పేరు ప్రఖ్యాతలు సంపాదించారని ప్రస్తుతం వాటిని మరింత పెంచుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. మల్లాపూర్, చర్లపల్లి, నాచారం, ఏ ఎస్ రావు నగర్ డివిజన్లో అక్రమ షెడ్లు ఈయన కనుసైకిల్లోనే జరుగుతున్నాయని ఒక్కొక్క షెడ్డు వెనుక లక్షలలో లంచాలు తీసుకుంటారన్న ఆరోపణలు ఉన్నాయి. చర్లపల్లిలో ఒక్క అక్రమ నిర్మాణాన్ని రెండుసార్లు సిజ్ చేయించిన ఘనత కూడా ఏసిపి కృష్ణమోహన్ దే అంటే అధికారి ఎంత భారీగా అక్రమ సొమ్ముకు ఆశపడి ప్రభుత్వ రూల్స్ ను అమ్ముకుంటున్నారో ఉన్నత ఆర్థికారులె అర్థం చేసుకోవచ్చు ఇలా ప్రతి ఒక్క సర్కిల్ కు ఏసీపీల అవినీతి దందా అంతా ఇంకా కాదు. ఒక్కొక్క ఏసీపీ దాదాపు 20 లక్షల నుండి 50 లక్షల పై మాటే ఒక నెలకు అక్రమ సంపాదన ఉందన్న ప్రతిపక్ష నాయకుల ఆరోపణలకు ఈ అధికారుల అవినీతి దగ్గర ఉండడం కూడా విస్మయాన్ని కలిగిస్తుంది. జిహెచ్ఎంసిలో విజిలెన్స్ విభాగం ఉన్న వృధా


హబ్సిగూడ డివిజన్ లో లక్ష్మి నగర్ కాలనీ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం

తప్ప ఎందుకు పనికిరాదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి సర్కార్ స్పందించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న టౌన్ ప్లానింగ్ ఏసీపీ ల అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని లేకుంటే భవిష్యత్తులో హైదరాబాద్ లో నివసించడం గగనతరంగా మారుతది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588